


# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి శుక్రవారం 25 ఫిబ్రవరి 2022 సంపుటి: 03 సంచిక: 171 పేజీలు: 4 వెల: రూ 3-00


# ఉక్రెయిన్‌లో రష్యా రక్తపాతం..

## తప్పుబట్టిన ప్రపంచ దేశాలు



హైదరాబాద్ : ఉక్రెయిన్‌లో రష్యా రక్తపాతం సృష్టిస్తున్నది. సరిహద్దు దాటి ఉక్రెయిన్‌లోకి ప్రవేశించిన రష్యా బలగాలు దాడులు చేస్తున్నాయి. రష్యా బాంబు దాడుల్లో వందలాది ఉక్రెయిన్ ప్రజలు మృతి చెందారు. రష్యా యుద్ధంతో ఉక్రెయిన్ ప్రజలు విలవిలలాడిపోతున్నారు. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం ప్రకటించడాన్ని పలు ప్రపంచ దేశాలు తప్పుబట్టాయి. అమెరికా, యూరోపియన్ యూనియన్, ఇటలీ, యూకేతో పాటు పలు దేశాలు ఉక్రెయిన్‌కు మద్దతుగా నిలిచాయి. రక్తపాతం సృష్టిస్తున్న రష్యాపై ఆయా దేశాల అధ్యక్షులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఉక్రెయిన్‌కు మద్దతుగా ఉంటాం : అమెరికా

ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధాన్ని ప్రకటించడాన్ని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ తీవ్రంగా ఖండించారు. ఉక్రెయిన్ ప్రజలకు తమ మద్దతు ఉంటుందని ప్రకటించారు. రష్యా దాడి అన్యాయమైనది అని ఆగ్రహం వెలిబుచ్చారు. ఉక్రెయిన్‌లో జరిగే విధ్వంసానికి రష్యా మాత్రమే బాధ్యత వహించాలని బైడెన్ హెచ్చరించారు. ఉక్రెయిన్‌కు మద్దతుగా ఆయా దేశాల మద్దతు కూడగడుతామని చెప్పారు. రష్యా, ఉక్రెయిన్ పరిణామాలను గమనిస్తున్నామని చెప్పారు. శుక్రవారం జీ-7 దేశాలతో సమావేశం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. నాటో కూటమికి సహకరిస్తామని తెలిపారు.

పుతిన్ రక్తపాతం సృష్టిస్తున్నాడు : యూకే

ఉక్రెయిన్‌కు మద్దతుగా ఉంటామని బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్ స్పష్టం చేశారు. రష్యా అధ్యక్షుడు ఉక్రెయిన్‌లో రక్తపాతం సృష్టించడం సరికాదన్నారు. రష్యాకు వ్యతిరేకంగా యూకేతో పాటు దాని మిత్రదేశాలు ఉంటాయన్నారు. ఉక్రెయిన్‌లో రష్యా బాంబు దాడులు తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేశాయని బోరిస్ జాన్సన్ పేర్కొన్నారు. ఇప్పటికే ఉక్రెయిన్‌లో దాడులపై ఆ దేశ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో మాట్లాడాను అని తెలిపారు.

రష్యానే బాధ్యత వహించాలి : యూరోపియన్ యూనియన్

ఉక్రెయిన్‌లో జరుగుతున్న విధ్వంసానికి రష్యానే బాధ్యత వహించాలని యూరోపియన్ యూనియన్ చీఫ్ ఉర్సులా వాన్ డెర్ లియోన్ ప్రకటించారు. ఉక్రెయిన్‌పై రష్యా దాడిని తీవ్రంగా ఖండించారు. రష్యాకు తగిన బుద్ధి చెప్తామన్నారు. అమాయక ప్రజల ప్రాణాలను బలి తీసుకోవడం సరికాదన్నారు. ఉక్రెయిన్‌కు ఎల్లప్పుడూ అండగా ఉంటామని స్పష్టం చేశారు.

రష్యా దాడి అన్యాయం : ఇటలీ

ఉక్రెయిన్‌పై రష్యా మిలటరీ దాడి చేయం అన్యాయమని ఇటలీ ప్రధాని మారియో ప్రకటించారు. రష్యా బాంబుల దాడిని ఎవరూ సమర్థించరు అని స్పష్టం చేశారు. ఈ యుద్ధాన్ని ఇటలీ ప్రభుత్వం తీవ్రంగా ఖండిస్తుందని చెప్పారు. నాటో కూటమికి సహకరిస్తామని తెలిపారు. ఉక్రెయిన్ ప్రజలకు తమ మద్దతు ఉంటుందన్నారు. రష్యాకు వ్యతిరేకంగా యూరోపియన్ యూనియన్ దేశాలతో కలిసి పని చేస్తామన్నారు.

రష్యా దాడిని ఖండించిన నాటో

ఉక్రెయిన్‌పై రష్యా దాడిని నాటో సెక్రటరీ జనరల్ జెన్స్ స్టోల్టెన్ బర్గ్ తీవ్రంగా ఖండించారు. రష్యా దూకుడు చర్యలపై చర్చించేందుకు నాటో కూటమి సమావేశమవుతుందని తెలిపారు.

# సహకార శాఖపై సీఎం వైయస్.జగన్ సమీక్ష



అమరావతి సహకార శాఖపై సీఎం వైయస్.జగన్ మోహన్ రెడ్డి గురువారం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల పనితీరు, వాటి బ్రాంచ్లు, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల పనితీరును సమీక్షించారు. సహకార బ్యాంకుల బలోపేతంపై ఇప్పటివరకూ తీసుకున్న చర్యలను అధికారులు వివరించారు. డీసీసీబీలు, సొసైటీలు బలోపేతం, కంప్యూటరైజేషన్, పారదర్శక విధానాలు, ఆర్బీకేలతో అనుసంధానం తదితర అంశాలపై కీలక చర్చ జరిగింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ బ్యాకింగ్ రంగంలో పోటీని ఎదుర్కొనేలా డీసీసీబీలు, సొసైటీలు ఉండాలి. ఈ పోటీని తట్టుకునేందుకు ఆర్షణీయమైన వడ్డీరేట్లతో రుణాలు ఇవ్వండి. నాణ్యమైన రుణసదుపాయం ఉంటే బ్యాంకులు బాగా వృద్ధిచెందుతాయి. మంచి ఎస్ఓపీలను పాటించేలా చూడాలి. డీసీసీబీలు లాభాల బాట పట్టేలా చూడాలి. డీసీసీబీలు పటిష్టంగా ఉంటే.. రైతులు మేలు పొందుతారు. బంగారంపై రుణాలు ఇచ్చి మిగిలిన బ్యాంకులు వ్యాపారపరంగా లబ్ధి పొందుతున్నాయి. రుణాలపై కచ్చితమైన భద్రత ఉన్నందున వాటికి మేలు చేకూరుతోంది. ఇలాంటి అవకాశాలను సహకార బ్యాంకులు కూడా సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. వాణిజ్య బ్యాంకులు, ఇతర బ్యాంకుల కన్నా తక్కువ వడ్డీకే బంగారంపై రుణాలు ఇవ్వడం ద్వారా ఖాతాదారులను తమవైపుకు తిప్పుకోవచ్చు. తద్వారా అటు ఖాతాదారులకు, ఇటు సహకార బ్యాంకులకు మేలు జరుగుతుందని అన్నారు. ? వ్యవసాయ రంగంలో ఆర్బీకేల్లాంటి విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చాం. జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు ఈ రంగంలో కీలక పాత్ర పోషిస్తాయి. అందుకనే వాటిని బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. రుణాల మంజూరులో ఎక్కడా రాజీ ఉండకూడదు, రాజకీయాలకు చోటు ఉండకూడదు. అవినీతికి, సిఫార్సులకు తావులేకుండా కేంద్ర సహకార బ్యాంకులు కార్యకలాపాలు సాగాలి. నిబంధనలు పాటిస్తున్నారా? లేదా? అన్నది చాలా ముఖ్యం. పాలనలో సమర్థతతో పాటు, అవినీతి లేకుండా ఉంటేనే, నాణ్యమైన సేవలు అందితేనే ప్రజలకు మేలు జరుగుతుంది. లేదంటే... ప్రజలకు నష్టం వాటిల్లుతుంది. సహకార బ్యాంకుల్లో ఖాతాదారులకు విశ్వాసం కలిగించే చర్యలు తీసుకోవాలి. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (పీఏసీఎస్)బ్యాంకింగ్ కార్యకలాపాలు ఆర్బీకేల ద్వారా సాగాలి. ఆమేరకు పీఏసీఎస్లను మ్యాపింగ్చేసి... వాటి కింద వచ్చే ఆర్బీకేలను నిర్ణయించాలి. ఆర్బీకేల్లో బ్యాంకింగ్ కార్యకలాపాలను పీఏసీఎస్లతో అనుసంధానం చేయాలి. ఇప్పటికే ఆర్బీకేల్లో బ్యాంకింగ్ కరస్పాండెంట్లు ఉన్నారు. వీరు రైతులకు, బ్యాంకులకు మధ్య అనుసంధాన కర్తగా వ్యవహరించాలని అయన అన్నారు. అంతిమంగా, ఆర్బీకేలు, ఆర్బీకేల్లోని బ్యాంకింగ్ కరస్పాండెంట్లు రైతులకు, బ్యాంకులకు మధ్య ప్రతినిధులుగా వ్యవహరిస్తారు. ఈ వ్యవస్థ ఎలా ఉండాలన్న దానిపై అధికారులు బ్యాంకింగ్ నిపుణులతో మాట్లాడి ఒక విధానాన్ని రూపొందించాలి. జిల్లాకేంద్ర సహకార బ్యాంకులు, సొసైటీల్లో చక్కటి యాజమాన్య విధానాలను తీసుకురావాలి. అంతిమంగా ప్రతి ఎకరా సాగుచేస్తున్న ప్రతిరైతుకూ మేలు జరగాలి. ఈ లక్ష్యం దిశగా సొసైటీలను నడిపించాలి. ప్రతిపాదనలను మరింత మెరుగ్గా తయారుచేసి తనకు నివేదించాలి. వ్యవసాయ సలహామండళ్ల సమావేశాల్లో బ్యాకింగ్ రంగంపై రైతులనుంచి వచ్చే ఫిర్యాదులు, సలహాలు, సూచనలు కూడా స్వీకరించి దానిపై తగిన విధంగా చర్యలు తీసుకోవాలి. ఆర్బీకేల్లో ఉన్న కియోస్కను సమర్థవంతంగా వాడుకోవాలి. బ్యాంకింగ్ కార్యకలాపాల్లో కూడా కియోస్కను సద్వినియోగం చేసుకోవాలి. రైతులకు సంబంధించి డాక్యుమెంట్లను కియోస్క ద్వారా అప్లోడ్ చేసే సదుపాయంకూడా ఉండాలి. ఈమేరకు కియోస్కో మార్పులు చేర్పులు చేయాలని సీఎం అన్నారు. ఈ సమీక్షా సమావేశంలో వ్యవసాయశాఖ మంత్రి కురసాల కన్నాబాబు, ఏపీ అగ్రికల్చర్ మిషన్ వైస్ ఛైర్మన్ ఎం వీ యస్ నాగిరెడ్డి, సీఎస్ డాక్టర్ సమీర్ శర్మ, వ్యవసాయశాఖ స్పెషల్ సీఎస్ పూనం మాలకొండయ్య, మార్కెటింగ్ శాఖ ముఖ్య కార్యదర్శి 2వై మధుసూధన్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అమరావతి ఉద్యమం చరిత్రలో నిలిచిపోతుంది: చంద్రబాబు



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌కు ఏకైక రాజధానిగా అమరావతిని కొనసాగించాలంటూ 800 రోజులుగా ఉద్యమం చేస్తున్న రైతులకు టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ అమరావతి ఉద్యమం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. రైతుల ఉద్యమానికి, పోరాటానికి టీడీపీ ఎప్పుడూ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. ప్రత్యేకంగా ఒక ప్రాంతం మీద కక్షను పెంచుకున్న ముఖ్యమంత్రిని దేశ చరిత్రలో మొదటిసారి చూస్తున్నామన్నారు. తన మూర్ఖపు వైఖరితో రాష్ట్రంలో లక్షల కోట్ల సంపదను సృష్టించే రాజధాని నిర్మాణాన్ని నిలిపివేసిన జగన్ తప్పులను చరిత్ర ఎప్పటికీ క్షమించదన్నారు. రాజధాని ప్రాంతం శ్మశానం అన్న వాళ్లే... ఇప్పుడు అమరావతి భూములను తాకట్టు పెట్టి అప్పులు తెచ్చుకుంటున్నారని చంద్రబాబు అన్నారు. రాజధాని విషయంలో నిలకడలేని నిర్ణయాలు, ముందు చూపులేని ఆలోచనలతో వ్యవహరిస్తున్న వైసీపీ ప్రభుత్వ వైఖరి రాష్ట్రానికి శాపంలా మారిందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా మూడు ముక్కల రాజధాని ప్రతిపాదనలను పూర్తిగా పక్కన పెట్టి అమరావతిని ఏకైక రాజధానిగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. దేశ చరిత్రలో నిలిచి పోయేలా జరుగుతున్న అమరావతి పరిరక్షణ ఉద్యమానికి తెలుగుదేశం ఎల్లవేళలా అండగా నిలుస్తుందని చంద్రబాబు స్పష్టం చేశారు.

# హిందుత్వం అంటే వ్యాపారం కాదు: సోము వీర్రాజు

విజయవాడ: హిందుత్వం అంటే వ్యాపారం కాదని, దేవాలయాలను ఆదాయాన్ని కుమ్మరించే వాటిగా చూస్తున్నారని ఏపీ బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు విమర్శించారు. టిటిడి బోర్డు చైర్మన్ నిర్ణయాలపై స్పందించిన ఆయన గురువారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ సేవా టికెట్ రేట్లు పెంచడంపై పునరాలోచన చేయాలని సూచించారు. బడ్జెట్‌లో హిందుత్వానికి నిధులు పెంచాలన్నారు. బోర్డు పరిపాలన ధర్మ బద్దంగా ఉండాలని, దేవాలయాల నిర్మాణానికి నిధులు ఎందుకు కేటాయించడం లేదని ప్రశ్నించారు. బీజేపీ అధికారంలోకి వస్తే దేవాలయాల పరిపాలన ప్రజల చేతుల్లో ఉంటుందన్నారు. హిందూ ధర్మం పట్ల వైసీపీ వైఖరి అనుమానించే రీతిలో ఉందని సోము వీర్రాజు అన్నారు.

# చంద్రబాబు డైరెక్షన్‌లో బీజేపీ నేతలు: మంత్రి వెల్లంపల్లి

విజయవాడ: చంద్రబాబు డైరెక్షన్‌లో బీజేపీ నేతలు నడుస్తున్నారని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ మండిపడ్డారు. గురువారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ, చంద్రబాబు పెట్టుబడిదారులైన సుజనా చౌదరి, సీఎం రమేష్‌లు ఏపీ బీజేపీలో పని చేస్తున్నారని దుయ్యబట్టారు. "గతంలో చంద్రబాబు రాసిచ్చిన స్క్రిప్ట్ లు పవన్ కల్యాణ్ ఒక్కరే చదివేవారు. ఇప్పుడు పవన్ కల్యాణ్‌కు




బీజేపీ నేతలు తోడయ్యారు. ఏపీకి ప్రత్యేకహోదా, పోలవరానికి నిధులు, కడపకు స్టీల్ ప్లాంట్, రైల్వేజోన్ ఇస్తామని చెప్పే సత్తా సోము వీర్రాజు, జీవీఎల్‌కు ఉందా?. బీజేపీ నేతలు కపట నాటకాలాడుతున్నారని" మంత్రి వెల్లంపల్లి నిప్పులు చెరిగారు. ఏపీ అభివృద్ధికి సుజనా చౌదరి, సీఎం రమేష్‌లు సైంధవుల్లా అడ్డుపడుతున్నారని.. ఇలాంటి వారు ఎంతమంది అడ్డుపడినా సీఎం జగన్ ఏపీని అభివృద్ధి చేసి తీరతారన్నారు. చంద్రబాబు ఇచ్చిన కాగితాలు చదవొద్దని ఏపీ బీజేపీ నేతలకు మంత్రి హితవు పలికారు. చంద్రబాబు డైరెక్షన్‌లో ఇలాగే కొనసాగితే బీజేపీ మరింత హీనంగా తయారవుతుందని మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ ధ్వజమెత్తారు.

# ఏపీపీఎస్సీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన గౌతమ్ సవాంగ్



విజయవాడ: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) చైర్మన్‌గా సీనియర్ ఐపీఎస్ అధికారి దామోదర్ గౌతమ్ సవాంగ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ బందర్‌రోడ్డులోని ఏపీపీఎస్సీ కార్యాలయంలో గౌతమ్ సవాంగ్ బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన ప్రత్యేక పూజలు చేసి, వేద పండితుల ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, సిబ్బంది గౌతమ్ సవాంగ్‌కు అభినందనలు తెలిపారు.

# ఉక్రెయిన్‌పై రష్యా దాడిని ఖండించిన జో బైడెన్



వాషింగ్టన్: ఉక్రెయిన్‌పై రష్యా దాడులను అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ (ఏనీవ తితిటవని) ఖండించారు. అన్యాయమైన దాడులతో ఉక్రెయిన్ ప్రజలను బాధపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఉక్రెయిన్‌లో పరిణామాలకు రష్యా బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఉక్రెయిన్‌పై రష్యా మిలిటరీ ఆపరేషన్ ప్రారంభించిన నేపథ్యంలో ఆయన మాట్లాడారు. రష్యా దాడికి ప్రతిచర్య తప్పదన్నారు. ముందస్తుగా నిర్ణయించుకునే పుతిన్ యుద్ధానికి దిగారని చెప్పారు. ఇది తీవ్రమైన విపత్తు, మానవాళి నష్టానికి దారితీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. రష్యా, ఉక్రెయిన్ పరిణామాలను గమనిస్తున్నామని చెప్పారు. శుక్రవారం జీ-7 దేశాలతో సమావేశం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. నాటో కూటమికి సహకరిస్తామని తెలిపారు. ఉక్రెయిన్‌పై మిలిటరీ ఆరేషన్ చేపట్టినట్లు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రకటించారు. ఉక్రెయిన్ సైన్యం తన ఆయుధాలను విడనాడాలని, వేర్పాటు వాదులు లొంగిపోవాలని సూచించారు. ఉక్రెయిన్ విషయంలో ఎవరూ జోక్యం చేసుకోవద్దని హెచ్చరించారు. జోక్యం చేసుకునేవారిపై ప్రతీకారం తీర్చుకుంటామని స్పష్టం చేశారు. వేర్పాటువాద ప్రాంతాల్లో పౌరులను రక్షించడానికే ఇది చేస్తున్నట్లు ప్రకటించారు. ఏదైనా రక్తపాతం జరిగితే దానికి ఉక్రెయిన్ పాలకులే బాధ్యతవహించాల్సి ఉంటుందన్నారు.

# ఉక్రెయిన్‌లో తెలుగు విద్యార్థులు క్షేమం: మంత్రి ఆదిమూలపు



అమరావతి: ఉక్రెయిన్ దేశంలో తెలుగు విద్యార్థులు క్షేమంగా ఉన్నారని ఏపీ మంత్రి ఆదిమూలాపు సురేష్ తెలిపారు. రష్యా, ఉక్రెయిన్‌పై దాడులు చేస్తున్న యుద్ధ సమయంలో మంత్రి ఆదిమూలాపు సురేష్ ఉక్రెయిన్‌లో ఉన్న తెలుగు విద్యార్థులతో ఫోన్‌లో మాట్లాడారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే కేంద్రానికి లేఖ రాశారని తెలిపారు. ప్రభుత్వం విద్యార్థులను ఉక్రెయిన్ రప్పించేందుకు ప్రయత్ని స్తోందని వెల్లడిం చారు. ప్రస్తుతం ఉక్రెయిన్‌లో విమాన సర్వీసులు రద్దయ్యాయని మంత్రి ఆదిమూలపు తెలిపారు. విద్యార్థుల సహాయం కోసం నోడల్ అధికారి, స్పెషల్ ఆఫీసర్‌ను నియమించినట్లు చెప్పారు. ఢిల్లీలోని ఏపీ భవన్‌లో అధికారులను అప్రమత్తం చేశామని పేర్కొన్నారు

# మాజీ మంత్రి అయ్యన్న పాత్రుడికి హై కోర్టులో ఊరట

అమరావతి: టీడీపీ నేత మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడికి హైకోర్టులో ఊరట లభించింది. సీఎంని దూషించారంటూ అయ్యన్నపాత్రుడిపై పశ్చిమ గోదావరి జిల్లాలో 505(2), 153(ఎ), 506 సెక్షన్ల కింద కేసు నమోదు అయ్యింది. అయ్యన్నపాత్రుడి ఇంటికి వచ్చిన నల్లజర్ల పోలీసులు నోటీసులంటించారు. బుధవారం రాత్రి అయ్యన్నపాత్రుడి ఇంటిని పోలీసులు చుట్టుముట్టారు. పోలీసుల చర్యలపై అయ్యన్నపాత్రుడి తరపు న్యాయవాది సతీష్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయ్యన్నపై నమోదైన కేసుల్లో తదనంతర చర్యలపై హైకోర్ట స్టే ఇచ్చింది. ఎటువంటి దూకుడు చర్యలు తీసుకోవద్దంటూ హైకోర్టు ఆదేశించింది. కేసులో తదనంతర చర్యలు నిలిపివేయాలని హైకోర్టు ఆదేశించింది.



# సంపాదకీయం

శుక్రవారం 25 ఫిబ్రవరి 2022

## తెలుగు రాష్ట్రాల్లో ముందస్తు అడుగులు....

ఉభయ తెలుగు రాష్ట్రాలలో ముందస్తు ఎన్నికల ఊహాగానాలు ఊపందుకున్నాయి. నిజానికి తెలంగాణలో అయినా ఏపీలో అయినా ప్రస్తుత అసెంబ్లీలకు ఇంకా చాలా గడువుంది. ఆంధ్ర ప్రదేశ్ ప్రస్తుతం శాసన సభకు 2024 జూన్ 2 తేదీ వరకు గడువుంది. ప్రస్తుత ప్రభుత్వం ముందూ వెనక ఆలోచన లేకుండా ఐదేళ్ళ గడవు పూర్తయిన తర్వాతనే ఎన్నికలకు వెళ్ళే ఆలోచన చేస్తే, లోక్ సభ ఎన్నికలతో పాటుగా,2024 ఏప్రిల్ – మే మాసాల్లో ఎన్నికలు జరగవలసి వుంటుంది. అంటే నిండా రెండేళ్లకు పైగా సమయముంది రాష్ట్రంలో సుందర ముదనష్టంగా సాగుతున్న వైసీపీ ప్రభుత్వ పాలన పట్ల ప్రజావ్యతిరేకత దినదిన ప్రవర్ధ మానంగా పరుగులు తీస్తున్న నేపధ్యంలో ముఖ్యమంత్రి జగన్ రెడ్డి అందాక ఆగేలా లేరని, తొందర పడుతున్నారని అంటున్నారు. జగన్ రెడ్డి, ఆలశ్యం అమృతం విషం అనే ఆలోచనలో ఉనారని, ముందస్తు ఎన్నికలకు వెళ్లారని రాజకీయ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. రాష్ట్ర మాజీ ముముఖ్యమంత్రి, తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు కూడా ముందస్తు తధ్యమని పార్టీని అందుకు సిద్ధం చేస్తున్నారు.అదలా ఉంటే, ఏపీకంటే ఎక్కువగా ముందస్తు ఊహాగానాలు వినిపిస్తున్న తెలంగాణలోనూ, ప్రస్తుత అసెంబ్లీ గడువు కొంచెం తక్కువగా ఉన్నా సంవత్సరం పైగానే ఉంది. ప్రస్తుత అసెంబ్లీ గడువు 16 జనవరి 2024 న ముగుస్తుంది. అంటే 2023 నవంబర్ – డిసెంబర్ మాసాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరిగితే సరిపోతుంది. అంటే ఇంచు మించుగా 20 నెలల గడువుంది. అయితే, రాష్ట్ర విభజన తర్వాత ఏర్పడిన తొలి శాసన సభ గడవు ముగియ కుండానే కాలం చేసింది. లోక్ సభ ఎన్నికలతో పాటుగా అసెంబ్లీ ఎన్నికలు జరిగితే కథ అడ్డం తిరుగుతుందని భావించారో ఏమో కానీ, తెరాస అధినేత ముఖ్యమంత్రి కేసీఆర్ సంవత్సరం ముందుగానే, 2018లోనే అసెంబ్లీ ఎన్నికలకు వెళ్లారు.ఆ ఎన్నికల్లో గెలిచి రెండవ సారి ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు. అయితే, ఆయన మళ్ళీ మరో మారు ముందస్తుకు వెళతారనే ఊహాగానాలు మాజోరుగా సాగుతున్నాయి. ఈ సంవత్సరం డిసెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు రద్దు చేసి, కర్ణాటక, గుజరాత్ ససన సభ ఎన్నికలతో పాటుగా 2023 మార్చి ఏప్రిల్ మాసాల్లో ఎన్నికలకు వెళ్ళాలని తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. అయితే ముందస్తు ఎన్నికలు జరుగుతాయా? జరిగితే, ఏపీలో వైసీపీ, తెలంగాణలో తెరాస మళ్ళీ అధికారంలోకి వస్తాయా? అంటే,సమాధానం అటూ ఇటుగా ఉందని పిస్తోందని పరిశీలకులు భావిస్తున్నారు. ఉభయ రాష్ట్రాలలో అధికారంలో ఉన్న వైసీపీ, తెరాస పార్టీలు ముందస్తు ఎన్నికలకు వెళ్ళాలని అలోచనకు వస్తున్నాయని అంటేనే, సగం ఓటమిని అంగీకరించడం అవుతుందని, మిగిలినసగం విపక్షాల సంసిద్ధత పై ఆధార పడి ఉంటుందని పరిశీలకులు అంటున్నారు. నిజానికి రెండు తెలుగు రాష్ట్రాలలోనూ కారణాలు వేరేయితే కావచ్చును కానీ, రాజకీయ పరిస్థితులు మాత్రం ఒకేలా ఉన్నాయి. అక్కడా, ఇక్కడా కూడా, అధికార పార్టీలు ప్రజాగ్రహాన్ని చవిచూస్తున్నాయి. ఓటమి భయం అధికారపార్టీలను వెంటాడుతోంది. ఆర్థిక పరిస్థితి అద్వాన్న స్థితికి చేరుకుంది. రెండు తెలుగు రాష్ట్రాలు అప్పుల ఊబిలో కూరుకుపోయాయి. నిజానికి ఉభయ తెలుగు రాష్ట్రాలలో అధికార పార్టీలు, పరిపాలనను భారంగా భావిస్తున్నాయి. అందుకే బుజం మార్చుకునే వెసులు బాటు కోసమే ముందస్తు ఎన్నికల ఆలోచన చేస్తున్నాయని పరిశీలకులు అంటున్నారు.అయితే, ముందస్తు ఎన్నికలను వస్తే ఎదుర్కొనేందుకు ప్రతిపక్ష పార్టీలు సిద్దంగా ఉన్నయా? ఢీ అంటే ఢీ అనెందుకు రెఢీ' గా ఉన్నాయా? ఇప్పుడ ఇదే అందరి ముందున్న మిలియన్ డాలర్ల ప్రశ్న

## గంటా నేతృత్వంలో టీడీపీ, జనసేన కూటమి

విశాఖపట్టణం ఫిబ్రవరి 24, రాజకీయాల్లో సమయానికి తగ్గట్టు రాజకీయం చేసి సక్సెస్ అవ్వడంలో గంటా శ్రీనివాసరావుని మించిన నాయకుడు లేరనే చెప్పాలి..ఈ సమయంలో ఎలా రాజకీయం చేయాలో గంటాకు బాగా తెలుసు. ఇంతకాలం అలాగే రాజకీయం చేసి సక్సెస్ అవుతున్నారు. అందుకే ఇంతవరకు ఆయన ఓడిపోలేదు. ఎన్ని పార్టీలు మారినా, నియోజకవర్గాలు మారినా సరే గంటాకు ఓటమి రాలేదు.అయితే గత ఎన్నికల్లో కూడా గంటా టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన విషయం తెలిసిందే?కాకపోతే టీడీపీ అధికారంలోకి రాకపోవడంతో సైలెంట్ అయిపోయారు..అదే సమయంలో వైసీపీలోకి వెళ్లడానికి కూడా ట్రై చేశారు?కానీ అది కుదరలేదు. ఇక ఇటీవల మళ్ళీ టీడీపీలో యాక్టివ్ అయ్యారు?నియోజకవర్గంలో తిరుగుతున్నారు. ఇలా టీడీపీలో యాక్టివ్ అయిన గంటా?ఇంకా వైసీపీ వైపుకు వెళ్ళే అవకాశం లేదని తెలుస్తోంది.అదే సమయంలో వైసీపీకి చెక్ పెట్టాలంటే టీడీపీ–జనసేనలు కలవాలనేది గంటా కాన్సెప్ట్..అందుకే ఇటీవల ఆ దిశగా గంటా ప్రయత్నాలు మొదలుపెట్టారని తెలిసింది. ఆ మధ్య కాపు నేతల సమావేశం జరిగిన విషయం తెలిసిందే?గంటానే లీడ్ తీసుకుని కార్యక్రమం నడిపించినట్లు తెలుస్తోంది..కాపులకు అధికారమే లక్ష్యంగా ఆ సమావేశం జరిగింది.కాకపోతే ఇప్పుడున్న పరిస్తితుల్లో కాపు నేతలు సెపరేట్‌గా పార్టీ పెట్టి సక్సెస్ అవ్వడం కష్టం..అదే సమయంలో జనసేనని పైకి లేపడం కష్టమే. మరి ఇలాంటి పరిస్తితుల్లో చాకచక్యంగా ముందుకెళ్లాలనేది గంటా ఆలోచన.. ఒంటరిగా అధికారం

దక్కించుకోవడం కష్టం కాబట్టి..అదే టీడీపీతో కలిస్తే అధికారం షేర్ చేసుకోవచ్చనేది గంట ఆలోచనగా ఉంది.అంటే చంద్రబాబు–పవన్ జట్టు కడితే జగన్ చెక్ పెట్టి అధికారం తెచ్చుకోవచ్చని గంటా ప్లాన్ చేస్తున్నారు..ఆ దిశగానే ఇప్పుడు పొత్తు సెట్ చేయడానికి ప్రయత్నిస్తున్నారని తెలిసింది. ఎలాగో బాబుతో క్లోజ్‌గా మాట్లాడే చనువు గంటాకు ఉంది..అటు జనసేన నేతలతో గంటాకు పరిచయాలు ఉన్నాయి. కాబట్టి టీడీపీ–జనసేనలు పొత్తు సెట్ చేయాలని గంటా గట్టిగానే ట్రై చేస్తున్నారు. మరి చూడాలి టీడీపీ–జనసేనల పొత్తు సెట్ అవుతుందో లేదో చూడాలి.

## అవినాష్ కు బిగిస్తున్న ఉచ్చు



కడప,ఫిబ్రవరి 24, ఏపీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి బాబాయ్ వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కడప ఎంపీ అవినాశ్ రెడ్డికి ఉచ్చు మరింతగా బిగుసుకుంటున్నట్లు కనిపిస్తోంది. వివేకా హత్య కేసులో అన్ని వేళ్లూ అవినాశ్ రెడ్డి వైపే చూపిస్తున్నాయి. వివేకా హత్య కేసులో అవినాశ్ రెడ్డి కుట్ర ఉందని సీబీఐ ఇప్పటికే చార్జిషీట్ వేసింది. ఎంపీ టికెట్ తనకు ఇవ్వొద్దని అన్నందుకే వివేకా హత్యకు కుట్ర చేసి ఉంటారని కూడా సీబీఐ చెబుతోంది. ఈ కేసులో అప్రూవర్ గా మారిన వివేకా మాజీ డ్రైవర్ దస్తగిరిని అవినాశ్ రెడ్డి మనుషులు వెంటాడి, వేధిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. దస్తగిరికి డబ్బు, పొలం ఆశ చూపించి.. సీబీఐ విచారణ వివరాల కోసం ప్రయత్నిస్తున్నట్లు సీబీఐకి ఫిర్యాదు రావడం గమనార్హం. 'సీబీఐకి ఇచ్చిన వాంగ్మూలంలో ఏం చెప్పావ్.. అవినాశ్ రెడ్డి పిలుస్తున్నాడు రా!' అంటూ అప్రూవర్ దస్తగిరిని బెదిరించారట. 'వివేకానందరెడ్డి ఇంటి లోపల ఏం జరిగిందో చెబితే నరికేస్తా' అని ఎర్ర గంగిరెడ్డి తనను బెదిరించినట్లు ఇంటి వాచ్ మన్ రంగన్న కూడా చెప్పాడు.తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర సంచలనం సృష్టించిన వివేకా హత్య కేసులో తాజాగా ఆనాటి పులివెందుల సీఐ శంకరయ్య సీబీఐకి చెప్పిన వివరాలు కూడా అవినాశ్ రెడ్డినే నిందితుడిగా చూపిస్తున్నాయి. వివేకానందరెడ్డి మరణించిన వెంటనే ఆయన గుండెపోటుతో చనిపోయారనే కథ అవినాశ్ రెడ్డే అల్లినట్లు సీబీఐకి సీఐ శంకరయ్య చెప్పిన మాటల్లో స్పష్టం అవుతోంది. 'వివేకానందరెడ్డి గుండెపోటుతో మరణించారని ఎంపీ అవినాశ్ రెడ్డి నాకు ఫోన్ లో చెప్పారు' అని సీబీఐకి సీఐ శంకరయ్య ఇచ్చిన వాంగ్మూలంలో చెప్పారు. వివేకాకు రక్తపు వాంతుల కథ, బెడ్రూంలో దుప్పటి మార్చుడం, మృతదేహానికి కుట్లు వేయడం, కట్లు కట్టడం.. ఇలా అన్నీ అనుమానాస్పదంగానే జరిగాయని కూడా శంకరయ్య సీబీఐకి తెలిపారు. వివేకా మర్డర్ జరిగిన తర్వాత వైఎస్ భాస్కర్ రెడ్డి, అవినాశ్ రెడ్డి, మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలోనే హత్యకు సంబంధించిన ఆధారాలు చెరిపేశారని కూడా సీఐ శంకరయ్య వివరించారు.'వివేకానంద రెడ్డి హత్య జరిగిన రోజు ఉదయం అవినాశ్ రెడ్డి పీఏ రాఘవరెడ్డి నాకు ఫోన్ చేశాడు. ఆ తర్వాత నాతో అవినాశ్ రెడ్డి మాట్లాడారు. ఒక బ్యాడ్ న్యూస్ అంటూ వివేకానందరెడ్డి గుండెపోటుతో మరణించినట్లు చెప్పారు. వెంటనే మా పోలీసు సిబ్బందిని వివేకా ఇంటి వద్దకు తీసుకురావాలన్నారు. ఇదే విషయం నేను స్థానిక డీఎస్పీకి తెలియజేశాను. ఎస్ఐలు, కానిస్టేబళ్లకు ఫోన్లు చేస్తుండగా.. ఐదు నిమిషాల్లో దేవిరెడ్డి శంకర్ రెడ్డి మరోసారి నాకు ఫోన్ చేశారు. ఆలస్యం ఎందుకు అవుతోందని కోప్పడ్డారు. సిబ్బందితో నేను సంఘటనా స్థలానికి వెళ్లే సరికే.. లోపల వైఎస్ భాస్కర్ రెడ్డి, మనోహర్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, ఎర్ర గంగిరెడ్డి, దొండ్లవాగు శంకర్ రెడ్డి, కాంపౌండర్లు వెంకటేశ్ నాయక్, జయప్రకాశ్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి ఉన్నారు. అక్కడ ఫొటోలు తీసి ఏడు గంటల సమయంలో ఎస్పీ రాహుల్ దేవ్ శర్మకు వాట్సాప్ చేశాను. బాత్ రూమ్ లోపల టైల్స్ పై రక్తం, బెడ్రూంలో దుప్పటిపై రక్తపు మరకలు, వివేకానందరెడ్డి తలపై బలమైన గాయాలు కనిపించాయి. దాంతో వివేకాది గుండెపోటు కాదని నేను వాదించాను. దాంతో ఎర్ర గంగిరెడ్డి, దేవిరెడ్డి శంకర్ రెడ్డి నోర్మూసుకో.. అని నన్ను బెదిరించారు. సైలెంట్ గా ఉండకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు' అని సీఐ శంకరయ్య సీబీఐకి మొత్తం వివరాలు తెలిపారు. 2020 జులై 28న సీబీఐ అధికారుల ఎదుట సీఐ శంకరయ్య వాంగ్మూలం ఇచ్చారు. ఆయన వాంగ్మూలం, అందులోని ముఖ్యమైన అంశాలు మంగళవారం వెలుగులోకి వచ్చాయి.వివేకా మృతి ఘటనపై కేసు నమోదు చేయొద్దని అవినాశ్ రెడ్డి, ఆయన అనుచరుడు దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి, ఎర్ర గంగిరెడ్డి తనపై వత్తిడి తెచ్చారని అన్నారు. ఈ విషయం అప్పటి కడప ఎస్పీ రాహుల్ దేవ్ శర్మ దృష్టికి తాను తీసుకెళ్లానన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వివేకా మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పంపించొద్దన్నారని చెప్పారు. అవినాశ్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, మనోహర్ రెడ్డి డైరెక్షన్, పర్యవేక్షణలోనే ఘటనా స్థలంలో ఆధారాల ధ్వంసం ప్రక్రియ జరిగిందన్నారు. ఘటనా స్థలంలో ఆధారాలు ధ్వంసం చేసే సమయంలోనే వివేకా ఇంటిలోపలికి ఎవరూ రాకుండా వైఎస్ భాస్కర్ రెడ్డి లోపలి నుంచి తలుపులు మూసేశారని సీఐ శంకరయ్య సీబీఐకి తెలిపారు. భాస్కర్ రెడ్డి తలుపు వద్దే ఉండి రక్తపు మరకలు శుభ్రం చేసే, గాయాలకు కట్లు, బ్ఆయండేజ్ వేసే వారిని మాత్రమే అనుమతించారని చెప్పారు. ఆ సమయంలో అవినాశ్ రెడ్డి రెండు మూడు సార్లు లోపలికి వెళ్లి కాసేపటి తర్వాత బయటకు వచ్చారని కూడా సీఐ వివరించారు.వివేకా మృతదేహాన్ని ఫ్రీజర్ లో పెట్టి, ఆయన శరీరంపై గాయాలు కనిపించకుండా చేయాలని చూశారని సీఐ శంకరయ్య వెల్లడించారు. వివేకా మృతదేహాన్ని ఫ్రీజర్ లో పెట్టి, గాయాలను పూలతో కప్పేయాలని చూశారన్నారు. కొందరు వ్యక్తులు ఫ్రీజర్ తీసుకువస్తే.. దాన్ని తాను వెనక్కి పంపించానన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం చేయించాలని, ఫ్రీజర్ లో పెట్టొద్దని ఎర్ర గంగిరెడ్డి, దేవిరెడ్డి శివశంకర్ రెడ్డికి చెప్పానన్నారు. వారు ఈ విషయం అవినాశ్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, మనోహర్ రెడ్డికి చెప్పారన్నారు. ఆ తర్వాత శివశంకర్ రెడ్డి అంబులెన్స్ పిలిపించినట్లు సీఐ శంకరయ్య వెల్లడించారు. వివేకా మృతదేహాన్ని చూసేందుకు నాలుగైదు వందల మంది వచ్చేందుకు ప్రయత్నిస్తే వారిని నియంత్రించామన్నారు. లాయర్ ఓబుల్ రెడ్డి ఘటనా స్థలంలోని రక్తపు మరకలు చూశారని, బయటకు వచ్చి ఎర్ర గంగిరెడ్డి, శివశంకర్ రెడ్డితో చెప్పారని, ఆ తర్వాతే ఆధారాల ధ్వంసం ప్రక్రియ మొదలైందన్నారు. తనతో పాటు వచ్చిన ముగ్గురు కానిస్టేబుళ్లను లోనికి వెళ్లకుండా శివశంకర్ రెడ్డి అడ్డుకుని, తనను ఒక్కడిని మాత్రమే లోపలికి పంపాడన్నారు. వివేకా సహాయకుడు ఇనయతుల్లా కూడా అనుమానం వ్యక్తం చేస్తే.. 'మీ సార్ కి ఎవరితోనూ శత్రుత్వం లేదు. ఆయనను హత్య చేసే అవకాశమే లేదు' అని శివశంకర్ రెడ్డి బెదిరించినట్లు సీఐ శంకరయ్య తెలిపారు.వివేకానందరెడ్డి మృతదేహాన్ని బాత్ రూం నుంచి బెడ్ రూంకు ఎర్ర గంగిరెడ్డి తీసుకొచ్చారు. రక్తపు మరకలతో ఉన్న వివేకా దుస్తులను మార్చేందుకు ప్రయత్నించారు. అయితే.. మృతదేహాన్ని పోస్టుమార్టానికి పంపించాలని, దుస్తులు మార్చటానికి వీల్లేదని వారిని నిలువరించాను. ఘటనా స్థలం మొత్తం వీడియో తీయాలని మా సిబ్బందికి చెప్పాను. వారు వీడియో తీస్తుండగా ఆపేయాలని దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి గట్టిగా కేకలు వేశారు. ఈ కేసులో ఎర్ర గంగిరెడ్డి, ఎం.వీ. కృష్ణారెడ్డి, ఉమాశంకర్ రెడ్డి, సునీల్ యాదవ్, దస్తగిరి పాత్ర అనుమానాస్పదం అనిపించింది. నేర స్థలంలో వైఎస్ అవినాశ్ రెడ్డి, దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి, వైఎస్ భాస్కర్ రెడ్డి, వైఎస్ మనోహర్ రెడ్డి పాత్ర అనుమానాస్పదం అనిపించింది' అని సీఐ శంకరయ్య సీబీఐకి ఇచ్చిన వాంగ్మూలంలో వివరించారు. వివేకా హత్య కేసులో గజ్జల ఉదయ్ కుమార్ రెడ్డి పాత్ర ఉందనే అనుమానం ఉన్నట్లు తన దర్యాప్తులో వెల్లడైందని గతంలో పులివెందుల డీఎస్పీగా పనిచేసిన రెడ్డివారి వాసుదేవన్ సీబీఐకి తెలిపారు.ఇలా ఉండగా.. వివేకా హత్య కేసులో తాజాగా మరో ట్విస్ట్ చోటు చేసుకుంది. ఈ కేసు దర్యాప్తు చేస్తున్న సీబీఐ అధికారి రామ్ సింగ్ పై రిమ్స్ పోలీసులు కేసు నమోదు చేయడం విశేషం. ఈ కేసు విచారణలో సీబీఐ అధికారి తనను వేధిస్తున్నారంటూ పులివెందుల బాకరాపురానికి చెందిన ఉదయ్ కుమార్ రెడ్డి ఫిబ్రవరి 15న ఏఆర్ అదనపు ఎస్పీ మహేశ్ కుమార్ కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ కేసుకు సంబంధించిన తాను చెప్పిన విషయాలు పట్టించుకోకుండా.. తాము చెప్పినట్లు వినాలని సీబీఐ అధికారి రామ్ సింగ్ శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారంటూ ఉదయ్ కుమార్ రెడ్డి ఆరోపించడం గమనార్హం.

## రజనీ కి... మేకపాటి పోస్ట్

గుంటూరు, ఫిబ్రవరి 24, చిలకలూరిపేట ఎమ్మెల్యే విడదల రజనీ జాక్ పాట్ కొట్టబోతున్నారా? అదృష్ట యోగం పట్టి.. ఆమెను అమాత్య పదవి వరించనుందా? సీఎం జగన్ కూడా ఆ దిశగా నిర్ణయం తీసుకునే అవకాశం ఉందా? ఆ క్రమంలో ఇప్పటికే ఈ అంశంపై ప్రభుత్వ సలహాదారు సజ్జలతో సీఎం జగన్ డిస్కషన్ చేశారా? అంటే అవుననే అంటున్నాయి తాడేపల్లి ప్యాలెస్ వర్గాలు.మేకపాటి గౌతమ్ రెడ్డి హఠాన్మరణంతో ఐటీ, పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి పదవి ఖాళీ అయింది. అయితే ఐటీ, పరిశ్రమలు, వాణిజ్యం మూడూ.... మూడు శాఖలే. ఈ శాఖను పక్కన పెడితే.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తీవ్ర గందరగోళమయ్యే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో ఆ మంత్రి పదవి ఎవరిని వరిస్తోందంటూ అప్పుడే ఊహాగానాలు ఊపందుకున్నాయి. అయితే ఈ శాఖను సీఎం జగన్.. విడదల రజినీకి కేటాయించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. విడదల రజని.. ఎన్నారై రిటర్న్. ఆమె సాఫ్ట్‌వేర్ రంగం నుంచి నేరుగా రాజకీయ రంగంలోకి ఎంట్రీ ఇచ్చారు. ఆమెకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీపై మంచి పరిజ్ఞానమే ఉంది. దీంతో ఆమెకు ఈ పదవి కట్టబెట్టాలని సీఎం జగన్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ మంత్రి పదవికి పలువురు పేర్లు సైతం తెరపైకి వచ్చినట్లు సమాచారం. అందులో ఆర్కే రోజా, బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పేర్లు కూడా ఉన్నాయని తెలుస్తోంది. అయితే ఎప్పటి నుంచో ఆర్కే రోజా మంత్రి పదవి కోసం కాచుకు కూర్చుని ఉన్నారు. 2019 ఎన్నికల్లో ఫ్యాన్ పార్టీ గెలుపుతో.. జగన్ కేబినెట్‌లో తనకు సీటు గ్యారెంటీ అని రోజా భావించారు. కానీ ఆమెకు మంత్రి పదవి దక్కకపోవడంతో... నాడు సీఎం జగన్ ఎదుటే ఆమె నిరసనకు దిగింది. దాంతో ఆమెకు సీఎం జగన్ ఏపీఐఐసీ ఛైర్మన్ పదవి కట్టబెట్టారు. ఇక, రోజాకు ఎప్పటికీ మంత్రి పదవి రాకుండా.. ప్రస్తుత మంత్రి పెద్దిరెడ్డి ఎలాగూ అడ్డుకోవడం ఖాయం అంటున్నారు. ఇటీవల రోజా, పెద్దిరెడ్డిల మధ్య వైరం బాగా ముదిరిపోయింది. ఈ విషయం రెడ్డివారి చక్రపాణిరెడ్డి వ్యవహారంలో బట్ట బయలు అయింది. ఈ నేపథ్యంలో రోజాకు చెక్ పెట్టేందుకు పెద్దిరెడ్డి ఎంత చేయాలో అన్ని చేస్తారని.. ఈ నేపథ్యంలో రోజా మంత్రి పదవిపై ఆశలు వదులుకోవాల్సిందే..అంటున్నారు. ఇక, ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డికి ఈ శాఖలు అప్పగిస్తే.. మరింత టెన్షన్ పడే అవకాశం ఉందని సీఎం జగన్ భావిస్తున్నట్లు తెలుస్తోంది.

## బొత్స రిటైర్మెంటేనా !

విజయనగరం, ఫిబ్రవరి 24, బొత్స సత్యనారాయణ తన రాజకీయాలకు ఇంతటితో ఫుల్ స్టాప్ పెడుతున్నారనే అనిపిస్తుంది. ఇదే ఆయనకు చివరిగా ప్రత్యక్ష ఎన్నిక అని ఆయన వర్గమే చెబుతుంది. రాజకీయాలకు, వయసుకు పెద్దగా సంబంధం లేకపోయినా ప్రస్తుతమున్న రాజకీయాల నుంచి తప్పుకుంటేనే బెటర్ అని బొత్స సత్యనారాయణ భావిస్తున్నారు. తన సమకాలీకులు, తన కంటే వయసులో పెద్దవారు రాజకీయాల్లో కొనసాగుతున్నప్పటికీ తాను ఇక రాజకీయాల నుంచి తప్పుకుని కొత్త వారికి అవకాశమివ్వాలని ఆయన భావిస్తున్నారు. రెండున్నరేళ్లుగా బొత్స సత్యనారాయణ జగన్ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్నారు. ఆయనకు కీలకమైన మంత్రిత్వ శాఖ బాధ్యతలను అప్పగించారు కూడా. బొత్స సత్యనారాయణ కూడా జగన్ కేబినెట్ లో సర్దుకుపోయారు. కానీ ప్రస్తుతమున్న పరిస్థితుల్లో వైసీపీలో దీర్ఘకాలం తాను రాజకీయం చేయలేనని బొత్స సత్యనారాయణ భావిస్తున్నారు. అందుకే ఈ సమయంలోనే కుమారుడిని రాజకీయాల్లోకి దింపి ఎదుగుదలను చూడాలని కోరుకుంటున్నారు. తిరుగులేని నేతగా... బొత్స సత్యనారాయణ విజయనగరం జిల్లాలో తిరుగులేని నేతగా కొనసాగుతున్నారు. ఆయన వల్లనే గతంలో కాంగ్రెస్ కాని, ప్రస్తుతం వైసీపీ కాని రాజకీయంగా రాణించగలిగింది. తాను ఈ సమయంలో హుందాగా రాజకీయాల నుంచి పక్కకు తప్పుకోవాలని భావిస్తున్నారు. కుమారుడు బొత్స సందీప్ ను వచ్చే ఎన్నికల్లో చీపురుపల్లి నుంచి పోటీ చేయించాలని భావిస్తున్నారు. అందుకోసం ఇప్పటి నుంచే గ్రౌండ్ ను ప్రిపేర్ చేస్తున్నారు.బొత్స సత్యనారాయణ తన వారసుడిని క్రియాశీలకంగా మారుస్తున్నారు. బొత్స సందీప్ వైద్య వృత్తిని అభ్యసించినా తల్లిదండ్రుల మార్గంలోనే నడవాలని నిర్ణయించుకున్నట్లుంది. ఇప్పటికే బొత్స సందీప్ సేవా కార్యక్రమాలతో ముందుకు వెళుతున్నారు. డెవెలెప్ మెంట్ ఆఫ్ హెల్త్ , ఎడ్యుకేషన్, ఎంప్లాయిమెంట్ వంటి వాటికోసం ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేశారు. ధీర పేరుతో సంస్థను ఏర్పాటు చేసి కోవిడ్ సమయంలోనూ బొత్స సందీప్ విజయనగరం జిల్లాలో విశిష్ట సేవలందించారు. తండ్రి మార్గంలోనే పయని స్తానని బొత్స సందీప్ చెబుతున్నారు. బొత్స యువసేనను ఏర్పాటు చేసి వివిధ సేవా కార్యక్రమాలను అందిస్తున్నారు.తండ్రిబొత్సరాజకీయ వారసత్వాన్ని సందీప్ నిలబెడతారా? లేదా? అన్నది రానున్న కాలంలో చూడాలి.

## 4 నెలల నుంచి నిలిచిన రిజిస్ట్రేషన్లు

తిరుపతి, ఫిబ్రవరి 24, (న్యూస్ పల్స్)చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో నాలుగు నెలల నుంచి లేఅవుట్ స్థలాల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. గత ఏడాది అక్టోబర్ ఆరో తేదీ నుంచి రిజిస్ట్రేషన్లు జరపడం లేదు. జిల్లా అధికారుల ఆదేశాల వల్ల రిజిస్ట్రేషన్లు నిలిపివేసినట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు.ఇదంతా రాజకీయ కుట్రలో భాగంగా జరుగుతుందని నేతలు చెబుతున్నారు. వెంటనే రిజిస్ట్రేషన్లు ప్రారంభించాలని వ్యాపారులు డిమాండ్ చేస్తున్నారు.చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో లేఅవుట్ స్థలాలకు నాలుగు నెలల నుంచి రిజిస్ట్రేషన్లను నిలిపివేశారు. ఈ ఏడాది అక్టోబర్ ఆరో తేదీ నుంచి రిజిస్ట్రేషన్లు జరపడం లేదు. జిల్లా అధికారుల ఆదేశాల వల్ల రిజిస్ట్రేషన్లు నిలుపుదల చేసినట్లు సంబంధిత అధికారులు చెబుతున్నా.. రాజకీయ ఒత్తిళ్ల కారణంగా రిజిస్ట్రేషన్లు ఆపేశారని ప్రతిపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయి. నియోజకవర్గంలో నాలుగు మండలాలతో పాటు కుప్పం మున్సిపాలిటి పరిధిలోని కోట్లలో పెట్టుబడి పెట్టిన వ్యాపారులు.. లేఅవుట్ స్థలాలకు రిజిస్ట్రేషన్లు జరగక తీవ్రంగా నష్టపోయామని వాపోతున్నారు.మరోవైపు రిజిస్ట్రేషన్ల వల్ల ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం సగానికి తగ్గిపోయిందని అధికారులు అంటున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 14 కోట్ల ఆదాయం లక్ష్యం కాగా.. జనవరి నెలాఖరు వరకు 4.80కోట్లు మాత్రమే వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు.మరోవైపు గత నాలుగు నెలల నుంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వెంచర్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ అనధికారికంగా నిలిపివేయడం జరిగిందనే విమర్శలు ఉన్నాయి. ప్రతిరోజు వందల సంఖ్యలో కొనుగోలు విక్రయాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం వచ్చేది కాని జిల్లా కలెక్టర్ మౌఖిక ఆదేశాల మేరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిలిపి వేయడం జరిగిందని కార్యాలయ సిబ్బంది చెబుతున్నారు. దీని వల్ల భూమి అమ్ముకొని తమ పిల్లలకు పెళ్లిళ్లు ,చదువులు చేయడానికి ఎదురు చూస్తున్న చాలామంది కుప్పం వాసులు ఇబ్బందులు పడుతున్నారు.అయితే నియోజకవర్గంలో టీడీపీని దెబ్బ తీయాలంటే నియోజకవర్గ పరిధిలోని నాయకులు కార్యకర్తలకు వెంచర్ లతో సంబంధాలు ఉన్నాయని వాటి రిజిస్ట్రేషన్ నిలిపివేయడంతో ఆర్థికంగా దెబ్బతింటారని అధికార పార్టీ సూచనలతోనే ఇలా చేస్తున్నారనే స్థానిక నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. అందుకే రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కుప్పంలోని సైట్ రిజిస్ట్రేషన్ నిలిపివేయడం చాలా దారుణమని వాపోతున్నారు కుప్పం ప్రజలు

## సాధారణకోచ్ లుగా రిజర్వుడ్ కోచ్

విజయవాడ, ఫిబ్రవరి 24,ప్రయాణికులకు విజయవాడ రైల్వే శుభవార్త చెప్పింది. ప్రయాణికుల సౌకర్యార్థం రిజర్వుడు కోచ్‌లను సాధారణ కోచ్‌లుగా మారుస్తున్నట్లు ప్రకటించింది. అన్ రిజర్వ్‌డ్ ప్రయాణికుల సౌకర్యం కోసం విజయవాడ డివిజన్ పరిధిలో నడిచే 50 రైళ్లలో కొన్ని రిజర్వ్‌డ్ కోచ్‌లను సాధారణ కోచ్‌లుగా మార్చి నడుపుతున్నట్లు విజయవాడ రైల్వే పీఆర్వో నస్రత్ మండ్రూపక్కర్ ఓ ప్రకటనలో వెల్లడించారు.విజయవాడ నుంచి ఏపీ, తెలంగాణలోని ముఖ్య ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు ఈ మేరకు ఈ సౌకర్యం లభించనున్నట్లు నస్రత్ పేర్కొన్నారు. మొత్తం 50 రైళ్లలో రిజర్వుడు కోచ్‌ల్లో సాధారణ ప్రయాణికులు ఎక్కేందుకు అవకాశం కల్పించినట్లు వెల్లడించారు.గూడురు– సికింద్రాబాద్, గూడురు– విజయవాడ, విజయవాడ– సికింద్రాబాద్, నర్సాపూర్– ధర్మవరం, తిరుపతి– కాకినాడ టౌన్, నర్సాపూర్– లింగంపల్లి, మచిలీపట్నం– బీదర్, విజయవాడ– లింగంపల్లి, తిరుపతి– ఆదిలాబాద్ రైళ్లతో సహా 50 రైళ్లలో గుర్తించిన కొన్ని రిజర్వ్‌డ్ కోచ్‌లలో సాధారణ ప్రయాణికులు ఎక్కేందుకు అవకాశం కల్పించినట్లు ఆమె తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

## చంద్రబాబు పీకేటీమ్...సేవలు

హైదరాబాద్, ఫిబ్రవరి 24,దేశమంతా పీకే శిష్యులే. ప్రశాంత్ కిశోర్ బ్రాండ్‌కు ఇప్పుడు బిగ్ డిమాండ్. జగన్, స్టాలిన్, మమత గెలుపుతో పీకేకు తిరుగులేకుండా పోయింది. అందుకే, తానే తోపుననుకునే కేసీఆర్ సైతం ఐ–ప్యాక్‌ను ఆశ్రయించక తప్పలేదు. షర్మిల సైతం పీకేనే హైర్ చేసుకుంది. అయితే, ప్రశాంత్ కిశోర్‌కు ఎంత డిమాండ్ ఉందో.. ఆయన టీమ్ సభ్యులకూ అంతే డిమాండ్. చాలామంది ప్రతిష్టాత్మక ఇనిస్టిట్యూషన్స్‌లో.. ప్రెస్టీజియస్ కోర్సులు చేసిన వారే కావడంతో.. పీకే టీమ్ అంతా టాలెంటెడే. ఐ–ప్యాక్‌లో రాజకీయ విశ్లేషణల్లో రాటుదేలిన వారే. అందుకే, వారిలో చాలామంది సొంతంగా స్ట్రాటజిస్టు అవతారం ఎత్తారు. పలు రాజకీయ పార్టీలతో కలిసి పని చేస్తున్నారు. ఇక, ఇన్నాళ్లూ టీడీపీకి ఎన్నికల వ్యూహకర్తగా పని చేసిన రాబిన్ శర్మ సైతం గతంలో పీకే టీమ్‌కు చెందినవారే.

# గూడూరును "నెల్లూరు"లో కందుకూరును "ప్రకాశం"లోనే కొనసాగించాలి

**సీఎం జగన్ను, జిల్లా కలెక్టర్ను కోరిన ఎంపీ ఆదాల**

నెల్లూరు ఫిబ్రవరి 24 నెల్లూరు జిల్లాలో మమేకమై అభివృద్ధి చెందిన గూడూరు ప్రాంతాన్ని నెల్లూరు జిల్లా లోనే కొనసాగించాలని, కందుకూరును ప్రకాశం జిల్లాలోనే ఉంచాలని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కి, నెల్లూరు జిల్లా కలెక్టర్ చక్రధర్ బాబుకు గురువారం లేఖలను పంపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 13 జిల్లాలను 26 జిల్లాలుగా పునర్వ్యవస్థీకరించాలని తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు పేర్కొన్నారు. చిన్న జిల్లాల విభజన వల్ల సత్వర ప్రగతి సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. జిల్లాల విభజనలో భాగంగా కందుకూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలపాలని, గూడూరు నియోజకవర్గాన్ని బాలాజీ జిల్లాలో కలపాలని ప్రతిపాదించారు. కందుకూరు నియోజకవర్గ ప్రజలు పని మీద నెల్లూరుకు రావాలంటే 110 కిలోమీటర్ల దూరం రావాల్సి ఉంటుందని, అదే ఒంగోలు వారికి 40 కిలోమీటర్ల దూరంలో ఉండి అందుబాటులో ఉందని తెలిపారు. గూడూరు నియోజకవర్గాన్ని బాలాజీ జిల్లాలో కలపడం వల్ల ఇక్కడి ప్రజలు 100 కిలోమీటర్లకు పైగా ప్రయాణించి తిరుపతికి వెళ్లాల్సి ఉంటుందని తెలిపారు. తద్వారా ఈ రెండు నియోజకవర్గాల ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొన్నారు.ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కందుకూరును ప్రకాశంలో, గూడూరును నెల్లూరు జిల్లాలోనే కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.

# పెందుర్తిని విశాఖలోనే వుంచాలి

విశాఖపట్నం రాష్ట్రంలో జిల్లాల పునర్విభజన నేపద్యంలో విశాఖ సిపిఐ నేతలు తమ అభ్యంతరాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.పెందుర్తి నియోజకవర్గాన్ని విశాఖలోనే కొనసాగించాలని కోరుతూ ప్రధానమైన డిమాండ్ ను అధికారులకు తెలియచేశామని సిపిఐ నగర కార్యదర్శి పైడి రాజు తెలిపారు.గత కొన్నేళ్లుగా వివాదస్పదంగా ఉన్న సింహాచలం భూములు పెందుర్తి,భీమిలి పరిదిలో ఉన్నాయని గుర్తు చేసిన ఆయన పెందుర్తిరి విశాఖ జిల్లాలోనే ఉంచిత సమస్య పరిష్కారం సులభతరం అవుతుందని చెప్పారు.రాష్ట్రంలో జిల్లాలు ఏర్పడితే విస్తీరణ తక్కువగా ఉన్న జిల్లాగా విశాఖ రూపాంతరం చెందుతుందని,పెందుర్తి నియోజకవర్గాన్ని విశాఖ జిల్లాలోనే కొనసాగిస్తే అభివృద్ధిని సాదించగలమని అన్నారు.?

# తప్పుడు వార్తలు రాస్తే ఊరుకోం

విశాఖపట్నం తెలుగు రాష్ట్రాల్లో వైఎస్ వివేకా హత్య తర్వాత టీడీపీ అధినేత చంద్రబాబుపై ఓ పత్రికలో దుష్ప్రచారం చేశారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పేర్కొన్నారు. గురువారం అయన మీడియాతో మాట్లాడారు. తన వ్యక్తిగత జీవితంపై కూడా ఓ మీడియా బురద జల్లిందని,తన వ్యక్తిత్వాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు.తప్పుడు వార్తలు రాస్తే చట్ట ప్రకారం ముందుకెళ్తామని అసెంబ్లీ సాక్షిగా తల్లిని కించపర్చేలా మాట్లాడారని అన్నారు.తాను కూడా జగన్ కుటుంబసభ్యుల మాట్లాడితే.. ఎలా ఉంటుందో ఆలోచించుకోవాలని సూచించారు.కానీ అది తమ సంస్కృతి కాదని తన తల్లిని కించపర్చిన ఏ ఒక్కరినీ వదిలిపెట్టనని అన్నారు.సాక్షి సహా మూడు మీడియా సంస్థలపై కేసు పెట్టారని అన్నారు.

# నర్సాపురం న జిల్లా కేంద్రం చేయాలి

ఏలూరు పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం ను జిల్లా కేంద్రంగా ప్రకటించాలని చేస్తున్న ఉద్యమం మరింత తీవ్రణ రూపం దాలుస్తుంది. నరసాపురం జె ఏ సీ నిర్వహిస్తున్న రిలే నిరాహారదీక్ష శిబిరం వద్ద నరసాపురం వనితా క్లబ్ ఆధ్వర్యంలో మహిళలు తలకు తలపాగా ధరించి కొబ్బరి బొండాలు అమ్మి వినూత్నముగా నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మహిళ కమిషన్ మాజీ సభ్యురాలు, వనితా క్లబ్ జోనల్ చైర్పర్సన్ డా.శిరిగినీడీ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ చారిత్రిక నేపథ్యం, రెవెన్యూ కేంద్రంగా ఉన్న నరసాపురం జిల్లా రాజధానిగా గా ప్రకటించక పోవడం దారుణం అన్నారు. ఈ ప్రాంతం కొబ్బరి, ఆక్వా పరిశ్రమ తో పలువురు జీవనోపాధి పొందుతున్నారన్నారు. జిల్లా కేంద్రం లేకపోతే భవిష్యత్తు అంధకారం గా మారుతుందన్నారు.వెంటనే నరసాపురం ను జిల్లా కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎక్కడ లేనివిధంగా నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గాన్ని జిల్లా కేంద్రంగా ప్రకటించక పోవడం దారుణమన్నారు. డచ్ వారి పరిపాలన నుంచి నరసాపురం పట్నం పరిపాలనా కేంద్రంగా విరాజిల్లుతున్నది అన్నారు. జిల్లా కేంద్రం ఏర్పాటు కు ఐకాస నాయకులు, ప్రజలు చేస్తున్న ఉద్యమాన్ని, ప్రజలు మనోభావాలు ను సీఎం జగన్ గుర్తించి జిల్లా కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి నర్సాపురం ని జిల్లా కేంద్రంగా ప్రకటించాలన్నారు.లేకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు.

# ఇస్రో ప్రదర్శన శాల

విశాఖపట్నంఅంతరిక్షంలోకి ఉపగ్రహాలను ప్రవేశపెట్టడంలో అంతర్జాతీయ ఖ్యాతి సాదించిన ఇస్రో తన ప్రయోగశాల స్పేస్ రీసెర్చ్ విశేషాలను విస్తరించేందుకు బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.శాటిలైట్ ఉపయోగాలు,దేశాభివృద్ధికి స్పేస్ రీసెర్చ్ అందిస్తున్న సేవలను నేరుగా వివరించేందుకు స్పేస్ హీల్స్ పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది.దీంట్లో బాగంగా విశాఖ ఏయూ సైన్స్ వారోత్సవాల్లో బాగంగా శ్రీహరికోట ఇస్రో అధికారుల సహకారంతో ప్రదర్శనశాలను ప్రారంభించారు.దేశంలో స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తైన సైన్స్ పై నేటి తరం విద్యార్ధుల్లో అవగాహన వచ్చేందుకు ఇస్రో సహకారంతో ఉపగ్రహాల ఉపయోగాలను వివరించేలా ప్రదర్శన శాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.1960 నుంచి దినదినాభివృద్ధి చెందుతున్న టెక్నాలజీ ఆధారంగా నింగిలోకి దూసుకెళ్తున్న ఉపగ్రహాల,రాకెట్స్,చంద్రయాన్ ఇలా విలువైన సమాచారాన్ని విద్యార్ధులు తెలుసుకునేలా వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## సీఎం జగన్ నిర్ణయాల వల్లే ఏపీకి రాజధాని లేదు: గోరంట్ల

తూర్పు గోదావరి: రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాల వల్లనే ఏపీకి రాజధాని లేకుండా పోతోందని టీడీపీ సీనియర్ నేత గోరంట్లబుచ్చయ్య చౌదరి ఆరోపించారు. రాజధాని కోసం 800రోజులుగా ఉద్యమం జరుగుతోందని అయినా ప్రభుత్వంలో కదలిక లేదని విమర్శించారు. ఏపీ రాజధాని విషయంలో కేంద్రం బాధ్యత తీసుకుని స్పష్టమైన నిర్ణయం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.జగన్ అవినీతి సొమ్ములో 10శాతం ఖర్చు పెట్టినా అమరావతి అభివృద్ధి జరిగేదని ఆయన అన్నారు.టీడీపీ హయాంలో 144 కేంద్ర ప్రభుత్వ సంస్థల కోసం కేటాయించిన భూముల్లో తక్షణమే కేంద్ర ప్రభుత్వం నిర్మాణాలు చేపట్టాలి బుచ్చయ్య చౌదరి డిమాండ్ చేశారు. ఏపీ రాజధానిగా అమరావతి ఉండాలన్నదే ప్రజలందరి ఏకైక కోరిక అని ఆయన స్పష్టం చేశారు.

# తిరునగరి కి ఆధ్యాత్మిక శోభ...




**టీటీడీ అనుసంధానంగా ప్రపంచమంతటా తిరుపతి జన్మదిన మహోత్సవాలు... భూమనకరుణాకర రెడ్డి**





తిరుపతి ఫిబ్రవరి 24 తిరుపతి జన్మదిన వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. తిరునగరి జన్మదినాన్ని పురష్కరించుకుని మరింతఆధ్యాత్మిక శోభ ను సంతరించుకుంది. కోట్లాది మందిచే జన్మదిన శుభాకాంక్షలు అందుకుంది. మానవ వికాస వేదిక చైర్మన్ హోదాలో తిరుపతి ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి ప్రత్యేక ఆహ్వానితులు భూమన కరుణాకర రెడ్డి ఆధ్వర్యంలో గురువారం తిరుపతి 892 వ జన్మదిన వేడుకలు ఆకట్టుకున్నాయి. జియ్యర్ స్వాములు వెంట రాగా, వేద పండితుల మంత్రోచ్ఛరణలు, భజన కీర్తనలు, మంగళ వాయిద్యాల ఆద్యంతం భక్తి ప్రపత్తులను చాటుతూ ప్రదర్శన సాగింది. పౌరాణిక కళా బృందాల లయబద్ధ విన్యాసాల నడుమ సాగిన కళా ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. భూమన నిర్వహించిన ఆధ్యాత్మిక శోభా ప్రదర్శనను స్వాగతిస్తూ దారి పొడవునా పచ్చ తోరణాలు కట్టి, కర్పూర హారతులు పడుతూ, పూజలు నిర్వహిస్తూ భక్త జనులు స్వాగతించారు. ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రంగా ప్రపంచ వ్యాప్త ప్రఖ్యాతులతో విరాజిల్లుతున్న నేటి తిరుపతిని 892 ఏళ్ల కిందట శ్రీ గోవిందరాజపురం గ్రామం పేరిట పునాది రాయి వేసి మరీ ఏర్పరిచిన శ్రీ రామానుజాచార్యలను స్మరించుకుని కార్యక్రమాన్ని భూమన చేపట్టారు. స్థానిక శ్రీ గోవింద రాజాస్వామిఆలయంలోని శ్రీ రామానుజాచార్యుల విగ్రహానికి పూజలు నిర్వహించి ఆలయ వీధుల్లో శోభా యాత్రను నిర్వహించారు – టీటీడీ కి అనుసంధానంగా.... ఈ సందర్భంగా భూమన కరుణాకర రెడ్డి మాట్లాడుతూ టీటీడీ కి అనుసంధానం చేస్తూ భవిష్యత్ లో ప్రపంచమంతటా తిరుపతి జన్మదిన వేడుకలను నిర్వహించేలా చర్యలు చేపడుతామని వెల్లడించారు. భగవద్ శ్రీ రామానుజాచార్యులు వారి దివ్య హస్తలతో పునాది వేసి, 892 సంవత్సరాల కిందట శ్రీ గోవింద రాజపురంగా గ్రామం గా నేటి తిరుపతిని ఏర్పాటు చేశారన్నారు. ప్రపంచంలో మరే ఇతర నగరాలకూ పుట్టిన తేదీ అంటూ లేదని, ఒక్క తిరుపతి కి మాత్రమే అంతటి ప్రాశస్త్యం ఉ ందన్నారు. 1130 సంవత్సరం ఫిబ్రవరి 24 వ తేదీన తన 112 వ ఏట శ్రీ రామానుజా చార్యులు శ్రీ గోవింద రాజుల స్వామి విగ్రహ ప్రతిష్ఠ తో పాటు ఆలయ వీరులకు శంకుస్థాపన చేసినట్టు చారిత్రక ఆధారాలు ఉన్నాయిని, శాసనాలు అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు. కాల గర్భంలో తిరుపతి జన్మదినపు తేదీ ప్రాముఖ్యతకు నోచుకోలేక పోయినా, ఇన్నేళ్ల తర్వాతైనా ఈ తరంలో తొలి సారి జన్మదిన వేడుకలు నిర్వహించడం తన అదృష్టంగా పేర్కొన్నారు. భావితరాలు మున్ముందు ఈ వేడుకలను కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ పాలక మండలి సభ్యుడు పోకల అశోక్ కుమార్, నగర మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, భూమన అభినయ్, నగర కమిషనర్ పీఎస్ గిరీష పాల్గొన్నారు.

# జగన్‌కు చిరంజీవి దండం పెట్టడం బాధనిపించింది: జేసీ



అనంతపురం: సినీ పరిశ్రమ కోసం సీఎం జగన్‌కు నటుడు చిరంజీవి దండం పెట్టడం బాధ కల్గించిందని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని పరిశ్రమలు బ్రతికే పరిస్థితి లేదన్నారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌పై జగన్ ప్రభుత్వం కక్ష సాధిస్తోందని దుయ్యబట్టారు. జగన్ చర్యలతో పవన్‌కు ఏం కాదు.. నిర్మాతలకే ఇబ్బందని తెలిపారు. పవన్‌ను ఏం చేయలేక.. సినిమా వారిపై పడ్డారా? అని ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు. ఇంకెంతమందిని జగన్‌రెడ్డి వేధిస్తారని నిలదీశారు. టీటీడీ రేట్లు ఎందుకు పెంచుతున్నారు? అని ప్రశ్నించారు. దేవస్థానం మీ అబ్బసొత్తు కాదు.. పేదలు తిరుపతికి రావద్దా? అని మరోసారి ప్రశ్నించారు. జగన్‌రెడ్డి.. ఇకనైనా ధరల పెంపు మానుకోవాలని ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు.

# ఢిల్లీ యూనివర్సిటీ పరీక్షల్లో సరి, బేసి ఫార్ములా



త్వరలో జరగబోయే పరీక్షలకు సంబంధించి కొత్త ఫార్ములాను ప్రవేశపెట్టింది ఢిల్లీ యూనివర్సిటీ. సరి, బేసి విధానంలో, వేర్వేరు పద్ధతుల్లో ఈ పరీక్షలు నిర్వహించనుంది. దీని ప్రకారం.. మొదటి, మూడో, ఐదో సెమిస్టర్ పరీక్షలు ఆన్‌లైన్‌లో.. ఓపెన్‌బుక్ మోడ్‌లో జరుగుతాయి. వీటిని బేసి సెమిస్టర్‌గా పిలుస్తున్నారు. రెండు, నాలుగు, ఆరు సెమిస్టర్ పరీక్షలు ఫిజికల్ మోడ్‌లో జరుగుతాయి. ఇవి సరి సెమిస్టర్ పరీక్షలు. వచ్చే మార్చి, ఏప్రిల్‌లో ఓపెన్ బుక్ పరీక్షలు, మే నెలలో ఫిజికల్ మోడ్ పరీక్షలు జరుగుతాయి.ప్రస్తుత కోవిడ్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఢిల్లీ యూనివర్సిటీతోపాటు, అనేక కాలేజీలు ఓపెన్ ఏరియాల్లో క్లాసులు నిర్వహిస్తున్నాయి. దీనివల్ల ఫిజికల్ డిస్టెన్స్ పాటించేందుకు కూడా వీలవుతుంది. కొత్త ఎన్విరాన్‌మెంట్‌లో అడ్జస్ట్ అయ్యేందుకు విద్యార్థులకు క్యాంపస్ పరిధిలో సైకలాజికల్ కౌన్సెలింగ్ కూడా నిర్వహిస్తున్నారు. రాబోయే పరీక్షలకు అనుగుణంగా విద్యార్థులకు క్లాసులు నిర్వహించాలని యూనివర్సిటీ తన పరిధిలోని విద్యాసంస్థలను ఆదేశించింది.

# ఉక్రెయిన్‌లో చిక్కుకున్న భారతీయులకు తాజా మార్గదర్శకాలు

న్యూఢిల్లీ : రష్యా దాడుల నేపథ్యంలో ఉక్రెయిన్‌లో చిక్కుకున్న భారతీయ పౌరులు, విద్యార్థుల కోసం భారత ప్రభుత్వం తాజాగా మార్గదర్శకాలను జారీ చేసింది. ఉక్రెయిన్ గగనతలాన్ని మూసివేసినందువల్ల ప్రత్యేక విమానాల కోసం రూపొందించిన షెడ్యూలు రద్దయిందని తెలిపింది. భారతీయులను అక్కడి నుంచి సురక్షిత ప్రాంతాలకు చేర్చేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొంది. ఈ ఏర్పాట్లు ఖరారైన వెంటనే సంబంధిత సమాచారాన్ని ఇండియన్ ఎంబసీ తెలియజేస్తుందని తెలిపింది. భారతీయులను ఉక్రెయిన్ పశ్చిమ ప్రాంతాలకు పంపించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపింది. అన్ని వేళల్లోనూ పాస్‌పోర్టులు, అవసరమైన ఇతర పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపింది. ఎప్పటికప్పుడు వివరాలను తెలుసుకునేందుకు ఇండియన్ ఎంబసీ వెబ్‌సైట్‌ను, ఫేస్‌బుక్, ట్విటర్, ఇన్‌స్టాగ్రామ్ పోస్టులను



పరిశీలించాలని చెప్పింది. అదేవిధంగా క్రింద పేర్కొన్న ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి, వివరాలను తెలుసుకోవచ్చునని సూచించింది.

# కన్న తండ్రిపై కర్కశత్వం.. గొంతుపై కత్తితో పొడిచి..

కర్నూలు, ఫిబ్రవరి 24, (న్యూస్ పల్స్)భార్య చనిపోయిందని రెండో పెళ్లి చేసుకుంటానన్నాడు. దీనికి కుటుంబసభ్యులు అభ్యంతరం చెప్పారు. అయినా అతను తన ప్రవర్తన మార్చుకోలేదు. వారితో గొడవ పడి వారికి దూరంగా వెళ్లిపోయి పెళ్లి సంబంధాల కోసం ప్రయత్నించాడు. వృద్ధాప్యంలో పెళ్లి చేసుకుంటే పరువు పోతుందని, ఆస్తి దక్కదని భావించిన కుమారుడు తండ్రిపై కక్ష పెంచుకున్నాడు. చంపేయాలని నిర్ణయించుకున్నాడు. దీని కోసం పెళ్లి సంబంధాలు చూస్తున్న వ్యక్తినే పావుగా వాడుకున్నాడు. అతనికి సుపారీ ఇచ్చి హత్య చేయించాడు. ముందస్తు పథకం ప్రకారం స్పాట్ కు రప్పించాడు. అనంతరం గొంతు కోసి దారుణంగా చంపారు. మృతదేహాన్ని గోనె సంచిలో కుక్కి కాల్వలో పడేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. దర్యాప్తు చేసి ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి నగదు, ఆయుధాలు, సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.కర్నూలు జిల్లా దేవనకొండ మండలం కూకటికొండకు చెందిన గొల్ల గోపాల్‌కు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు సంతానం. గోపాల్ భార్య మృతి చెందడంతో రెండో పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. దీనికి అతని కుమారులు, కుమార్తెలు అభ్యంతరం తెలిపారు. దీంతో గోపాల్ వారితో గొడవ పడి కర్నూలులో నివాసం ఉండేవారు. ఈ క్రమంలో రెండో పెళ్లి సంబంధాలు చూడాలని.. సింగాపురం గ్రామానికి చెందిన పలువురిని కోరాడు. విషయం తెలిసుకున్న గోపాల్ పెద్ద కుమారుడు తన తండ్రికి పెళ్లి సంబంధాలు చూడొద్దని చెప్పాడు. తండ్రిని హత్య చేసేందుకు ఈరన్న అనే వ్యక్తికి రూ.1.50 లక్షలు సుపారీ ఇస్తానని వివరించాడు. సుపారిని అంగీకరించిన ఈరన్న ఈనెల 14 న గోపాల్‌కు ఫోన్ చేశాడు. ఎమ్మిగనూరు రావాలని కోరాడు.ముందస్తు పథకం ప్రకారం గోపాల్ కుమారుడు బాలరంగడు, కుమ్మరి ఈరన్న, మరో వ్యక్తిని వెంటబెట్టుకుని బైక్ పై ఎల్ఎల్‌సీ కాల్వ వద్దకు చేరుకున్నారు.

# భద్రాద్రి రామయ్య కల్యాణానికి సిద్ధం అవుతున్న గోటి తలంబ్రాలు

భద్రాచలం, ఫిబ్రవరి 24 వేయి పున్నముల శోభను కళ్లెదుట సాక్షాత్కరింపచేసే భద్రాద్రి రాములోరి కల్యాణం అద్వితీయం.. అపురూపం.. ఈ మహోత్సవం అత్యంత వైభవంగా జరుగుతుందిభక్తులు తండోపంతాలుగా తరలివస్తారు... కానుకలు, నైవేద్యాలు సమర్పించుకుంటారు... కానీ ఆ సీతారాముల కల్యాణానికి కావాల్సిన తలంబ్రాలు సమర్పించే భాగ్యం మాత్రం కొందరికే దక్కుతుంది... ఈసారి కూడా ఆ అవకాశాన్ని శ్రీరఘురామ భక్త సమితే పొందింది.భద్రాద్రి రామయ్య కల్యాణానికి గోటితో ఒలిచే తలంబ్రాలు సమర్పించే భాగ్యాన్ని ఆంధ్రప్రదేశ్? ప్రకాశం జిల్లా చీరాలలోని శ్రీరఘురామ భక్త సేవా సమితి దక్కించుకుంది. శ్రీరామనవమి రోజున సీతారామ కళ్యాణానికి ఉపయోగించే తరంబ్రాలను గోటితో వలిచి తలంబ్రాలుగా తీర్చిదిద్దే అవకాశాన్ని వరుసగా ఎనిమిదోసారి సేవా సమితి దక్కించుకుంది. గత ఐదు రోజుల నుంచి గోటితో వడ్లు వలిచే ప్రక్రియ ప్రారంభించారు. ఈ క్రతువు భద్రాచలంలో తలంబ్రాలు సమర్పించటంతో ముగియనుంది.11 మందితో ఏర్పడి: చీరాలకు చెందిన శ్రీరఘురామ భక్త సేవా సమితి 2011లో 11 మంది సభ్యులతో ఏర్పాటైంది. 2013లో శ్రీరామ నవమి వేడుకలకు తలంబ్రాలు సమర్పించేందుకు భద్రాచలం దేవస్థానం నుంచి అనుమతి పొందారు. అప్పటినుంచి భద్రాచలానికి గోటితో ఒలిచిన తలంబ్రాలను పంపుతున్నారు. ఈ క్రతువు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, గుజరాత్, తమిళనాడు, కేరళ రాష్ట్రాలతో పాటు దిల్లీ, బెంగుళూరు, చెన్నై, ఒడిశా మొదలుకుని.. అమెరికా, దక్షణాఫ్రికా, కెనడా, తదితర ప్రాంతాల్లో జరగుతుంది. 50 మంది పర్యవేక్షకుల మధ్య పది వేలకు పైగా భక్తులు పాల్గొంటున్నారు. కమిటీ ప్రతినిధులు దేశవ్యాప్తంగా సామాజిక మాధ్యమాల సహాయంతో రామ భక్తులకు ఈ వడ్లను పంపిస్తారు. వారు ఒలవడం పూర్తి చేసి వాటిని పర్యవేక్షకుల వద్దకు కొరియర్ల ద్వారా చేరుస్తారు.మొత్తం క్రతువుకు 15 వేల కిలోల బియ్యం.: శీరాముడి కల్యాణ క్రతువుకు మొత్తం 15 వేల కిలోల బియ్యం అవసరం కానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఏప్రిల్ 10వ తేదీ శ్రీరామ నవమి పర్వదినం. మార్చి 26వ తేదీ వరకు గోటితో ఒడ్లను ఒలిచి 27వ తేదీన మూటలు కడతారు. సుమారు 30 కింట్వాళ్ల బియ్యాన్ని పసుపు ఇతర సుగంధద్రవ్యాలతో కలుపుతారు. అన్నింటినీ అదేరోజు భద్రాచలానికి పంపిస్తారు. పసుపు 250 కిలోలు, కుంకుమ 500 కిలోలు, నూనె, నెయ్యిని భద్రాచలానికి పంపుతామని నిర్వాహకులు పొత్తూరి బాలకేశవులు తెలిపారు.

# బాధితులకు న్యాయం చేసిన రెవెన్యూ అధికారులు

తుగ్గలి ఆక్రమణకు గురైన భూమి ను లబ్ధిదారులకు అందజేసి బాధితులకు రెవెన్యూ అధికారులు న్యాయం చేశారని ఎంఆర్పిఎస్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌బొందిమడుగుల టి ఎం రమేష్ మాదిగ తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గం తుగ్గలి మండలంలోని ముక్కెళ్ల గ్రామంలో సర్వే నంబర్ 30/2 విస్తీర్ణంలో 5 ఎకరాల 33 సెంట్ల భూమి మాదిగ మస్తానప్ప కొనుగోలు చేసిన భూమి ఈయనకు రెవెన్యూ రికార్డులు సక్రమంగా ఉన్నాయి.ఈ భూమిని 35 సంవత్సరాలుగా ఆ గ్రామానికి చెందిన ఉన్నతమైన కులం వారు దౌర్జన్యం తో ఆక్రమించుకొని అక్రమంగా సాగు చేసుకుంటూ బాధితులైన మాదిగ మస్తానప్ప పై దౌర్జన్యం చేయడమైనది.ఈ విషయం తుగ్గలి తహసిల్దార్ కు ఎమ్ఆర్పిఎస్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొందిమడుగుల టి ఎం రమేష్ మాదిగ బాధితులతో కలిసి ఫిర్యాదు చేయగా, స్పందించిన తుగ్గలి రెవెన్యూ తహసిల్దార్ నజ్మాభాను వెంటనే మండల సర్వేయర్ కు ఆదేశాలు జారీ చేయడమైనది.తహసిల్దార్ ఆదేశాల మేరకు సర్వేయర్ గాది లింగప్ప ఆక్రమణకు గురైన భూమికు చుట్టూ కొలతలు వేసి హద్దులు చూపించి అక్రమంగా సాగు చేస్తున్న వారిని భూమి నుండి తొలగించి బాధితుడు మాదిగ మస్తానప్ప కు మండల సర్వేయర్ గాధి లింగప్ప చుట్టూ కొలతలు వేసి హద్దులు చూపించి బాధితుడికి న్యాయం చేయడమైనది షెడ్యూల్డ్ కులాల వారి భూములను ఉన్నతమైన కులాల వారు ఆక్రమించుకొని దౌర్జన్యాలు చేస్తే ఉపేక్షించమని, రెవెన్యూ అధికారులు అక్రమార్కులపై కఠినమైన చర్యలు తీసుకొని షెడ్యూల్డ్ కులాల వారి భూములకు రక్షణ కల్పించి అండగా ఉ ండి న్యాయం చేయాలని ఎమ్ఆర్పిఎస్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొందిమడుగుల టీ ఎం రమేష్ మాదిగ మాదిగ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రామాంజనేయులు మాదిగ, రంజిత్ మాదిగ,రంగస్వామి మాదిగ,గిడ్డయ్య మాదిగ,తిప్పన మాదిగ, మస్తానయ్య మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రమంత్రి శర్బానంద్ కు ఘనసత్కారం

**పోర్టు కార్మికుల సమస్యలు పరిష్కరించండి**

**వినతిపత్రం సమర్పించిన గంట్ల**

విశాఖపట్నం, ఫిబ్రవరి 24 కేంద్ర పోర్టులు, షిప్పింగ్ మంత్రిత్వశాఖ మంత్రి శర్బానంద్ సోనోవాల్ ను విశాఖ పోర్టు ట్రస్టు మాజీ సలహాదారు, అప్పన్న ధర్మకర్తల మండలి ప్రత్యేక ఆహ్వానితులు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు ఘనంగా సత్కరించారు. గురువారము బీచ్ రోడ్ లోని అతిధి గృహములో కేంద్రమంత్రికి సింహాద్రినాధుడి జ్ఞాపికను అందజేసి స్వామి గొప్పతనాన్ని శ్రీనుబాబు వివరించారు. సింహాద్రినాధుడు అత్యంత మహిమాన్వితుడని ఈ సందర్భంగా తెలియజేశారు. ఇక కేంద్రమంత్రికి పలు అంశాలుతో కూడిన వినతిపత్రంను శ్రీనుబాబు అందజేశారు. విశాఖ పోర్టులో కార్మికులకు న్యాయం చేయాలని, వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. భారతీయ జనతాపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్. భాజాపా ఉపాధ్యక్షులు విష్ణుకుమార్ రాజు, సెయిల్ ఇండిపెండెంట్ డైరెక్టర్ సాగి కాశీవిశ్వనాధరాజు. పార్టీ నగర అధ్యక్షులు మేడపాటి రవీంద్రనాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉక్రెయిన్‌లో సిక్కోలు వాసులు

శ్రీకాకుళం: ఉక్రెయిన్ దేశంలో సిక్కోలు విద్యార్థులు చిక్కుకున్నారు. జిల్లాలోని వీరఘట్టాం మండలం కంబరివలస గ్రామానికి చెందిన కుమారస్వామి, వంశీకృష్ణ బోకోవిన్ యూనివర్సిటీలో చదువుతున్నారు. ఉక్రెయిన్ పై రష్యా బాంబుల వర్షం కురిపిస్తుండడంతో విద్యార్థుల కుటుంబసభ్యులు ఆందోళన



చెందుతున్నారు. అయితే తాము క్షేమంగానే ఉన్నామని తల్లిదండ్రులకు విద్యార్థులు వీడియో సందేశం పంపారు. తమ వారిని క్షేమంగా ఇండియాకు రప్పించాలని ఎంపీ రామ్మోహన్‌నాయుడుకి వినతి చేశారు.

# భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలి

## నంద్యాల సబ్ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్



నంద్యాల ఫిబ్రవరి 24( విభారె) :- గురువారం నాడు అహోబిల పుణ్యక్షేత్రంలో జరుగు లక్ష్మి నరసింహ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా జరుగుతున్న ఏర్పాట్లను. నంద్యాల సబ్ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్. అహోబిల లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానం కార్యనిర్వాహక అధికారి నరసయ్య . ఆళ్లగడ్డ తహసిల్దార్ రమేష్ రెడ్డి ఎంపీడీవో శ్యామల అటవీశాఖ రుద్రవరం రేంజర్ ప్రతాప్ నాయుడు లతో కలిసి పరిశీలించారు.నంద్యాల సబ్ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్. మాట్లాడుతూ అహోబిల పుణ్యక్షేత్రం లో మార్చినెల 8 వ తారీకు నుంచి మార్చి 19 వ తారీఖు వరకు లక్ష్మి నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారని బ్రహ్మోత్సవ ఏర్పాట్లుకు గాను మొదటి సమీక్ష సమావేశం. నంద్యాల సబ్ కలెక్టర్ వారి కార్యాలయం నందు. నిర్వహించామని ఈ సమావేశంలో ఏ ఏ శాఖలవారు ఏ ఏ పనులు చేయాలి అనే అంశంపై సంబంధిత అధికారులను ఆదేశించామని జరుగుతున్న పనుల ను ఆకస్మికంగా తనిఖీ చేయడం కొరకు రావడం జరిగిందన్నారు. ఈ క్షేత్రంలోని పంచాయతీరాజ్ శాఖ వారు. రహదారులు భవనాల శాఖ వారు. ఎలక్ట్రిసిటీ వారు తదితర సంబంధిత అధికారులను కలిసి ఏ ఏ శాఖ వారు ఎంత వరకు పనులు నిర్వహించారని క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరిగింది అన్నారు. పంచాయతీరాజ్ శాఖ. రహదారులు మరియు భవనాల శాఖ. పోలీస్ డిపార్ట్మెంట్. ఫారెస్ట్ డిపార్ట్మెంట్. డబ్ల్యూ ఎస్ డిపార్ట్మెంట్ వారు అధికారులందరూ సమన్వయంతో వ్యవహరించి ఎగువ అహోబిలం మరియు ది గువ అహోబిలం లలో జరుగు ఈ బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించామన్నారు. బ్రహ్మోత్సవాలు కేవలం 12 రోజులలో ప్రారంభోత్సవం అవుతున్నాయని కావున సంబంధిత అధికారులు వచ్చే భక్తులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా ఉండేవిధంగా మౌలిక సదుపాయాలు త్వరిత గతిన పూర్తి చేయాలని ఆదేశించడం జరిగింది అన్నారు.

# సచివాలయం తనిఖీచేసిన సబ్ కలెక్టర్ చాహత్ బాజ్పాయ్

నంద్యాల ఫిబ్రవరి 24( విభారె) :- గురువారం ఆళ్ళగడ్డ పట్టణం లోని పాలసాగరం సచివాలయమును.నంద్యాల సబ్ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్. ఆళ్ళగడ్డ తహసీల్దార్ రమేష్ రెడ్డి లతో కలసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా.నంద్యాల సబ్ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ .సచివాలయ సిబ్బందితో మాట్లాడుతూ సచివాలయ పరిధిలో ఎంత మంది జనాభా ఉన్నారు, అందులో మహిళలు పురుషులు ఎంతమంది వంటి వివరాలు సచివాలయాల పరిధిలో ఎన్ని రేషన్ కార్డులు ఉన్నాయి, ఎంతమందికి పెన్షన్ లు వస్తున్నాయి వంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సచివాలయంలో సిబ్బంది హాజరు పట్టిక, సంక్షేమ పథకాల క్యాలెండర్, స్పందన అర్జీల రిజిస్టర్, మూమెంట్ రిజిస్టర్, ప్రభుత్వ పథకాల పోస్టర్ లు తదితర వాటిని పరిశీలించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించి లబ్ధిదారుల జాబితాను సచివాలయం బయట ప్రదర్శించాలన్నారు. జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.గ్రామంలో జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం లబ్ధిదారులు ఎంత మంది ఉన్నారు, ఇప్పటివరకు ఎన్ని ఇండ్లు సర్వే చేశారు, వెరిఫికేషన్, డేటా ఎంట్రీ ఎన్ని చేశారు వంటి వివరాలను విఆర్ ఓ, డిజిటల్ అసిస్టెంట్, ఇంజనీర్ అసిస్టెంట్, హౌసింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు సర్వే ను త్వరితగతిన పూర్తి చేయాలని పైకం చెల్లించు వారికి సచివాలయాల ద్వారానే రిజిస్ట్రేషన్ ప్రక్రియను కూడా పూర్తి చేయాలన్నారు . జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం నూరు శాతం విజయవంతం చేసేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్ళాలి జగనన్న సంపూర్ణ గృహహక్కు పథకాన్ని వేగవంతం చేయాలన్నారు సంపూర్ణ గృహహక్కు పథకంలో సుముఖత ఉన్న వారితో మాత్రమే పైకము తీసుకోవాలని ఎవరిని బలవంతం పెట్టవలసిన అవసరం లేదన్నారు

# సివిల్ సప్లైస్ హమాలీల కూలి రేట్లు పెంచాలి



నంద్యాల ఫిబ్రవరి 24( విభారె) :నంద్యాల పట్టణంలో గురువారం నాడు సివిల్ సప్లై హమాలీ కార్మికులకు కూలి రేట్లు పెంచాలని ,కరోనా భీమా సౌకర్యం 50లక్షలు కల్పించాలని కోరుతూ సిఐటియు ఆద్వర్యంలో సివిల్ సప్లై హమాలీ కార్మికులు టెక్కె మార్కెట్ యార్డు ముందు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలియజేశారు. గత మూడు రోజులుగా నిరసన వ్యక్తం చేస్తూన్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్టుగా లేదని ఆవేదన వ్యక్తం చేశారు .ఈ కార్యక్రమంలో సిఐటియు అధ్యక్షులు లక్ష్మణ్,సివిల్ సప్లై హమాలీ యూనియన్ కార్యదర్శి గోపాల్ లు మాట్లాడుతూ సివిల్ సప్లై హమాలీ కార్మికులకు కూలి రేట్లు పెంచాలని,కరోనా భీమా సౌకర్యం 50లక్షలు కల్పించాలని, కరోనా కాలంలో కూడా ప్రజలు ఇబ్బందులకు గురి కాకుండా ప్రభుత్వం చేస్తున్నటువంటి కృషికి తోడుగా కరోనాతో చనిపోతున్నా లెక్కచేయకుండా సివిల్ సప్లై హమాలి కార్మికులు ఎగుమతి, దిగుమతులు చేయడం జరిగిందని, ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి హమాలీ కార్మికుల సమస్యలను పరిష్కారం చేయాలని లేకుంటే నిరవధిక సమ్మె కైనా చలో విజయవాడ కైనా సిద్ధమని, రాబోయే కాలంలో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో 40 మంది హమాలీ కార్మికులు పాల్గొనడం జరిగింది.

## ముమ్మరంగా కొనసాగుతున్న చెరువు అభివృద్ధి పనులు

తుగ్గలి: ఫిబ్రవరి 24( విభారె) తుగ్గలి మండల పరిధిలోని జొన్నగిరి గ్రామ చెరువు నందు అభివృద్ధి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని ఇరిగేషన్ అధికారులు తెలియజేశారు.ఈ సందర్భంగా ఇరిగేషన్ ఏఈ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఐదున్నర కోటి రూపాయల నిధులతో నాణ్యతతో కూడిన అభివృద్ధి పనులను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలియజేశారు.ఇప్పటివరకు జొన్నగిరి చెరువులో చెరువు కట్ట ఇరువైపులా ముళ్ళకంప తొలగింపు,ఆనకట్ట లీకేజీ లేకుండా పనులను పూర్తి చేసినట్లు ఆయన తెలియజేశారు. ప్రస్తుతం చెరువులో 30 శాతం మేర నీటి సామర్థ్యం పెంపు కొరకు మట్టి తొలింపు



పనులను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలియజేశారు.మట్టి తరలింపు పనులను క్వాలిటీ కంట్రోల్ ఏఈ రాణెమ్మ పరిశీలించారు. చెరువు అభివృద్ధి పనులలో నాణ్యత కలిగి ఉండాలని ఆమె అధికారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డి.ఈ ఆర్.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల శ్రేయస్సు కోసం రెండు మండలాలను నంద్యాల జిల్లా లో కలపాల

### బొజ్జా దశరథ రామిరెడ్డి

నంద్యాల ఫిబ్రవరి 24( విభారె) :- నంద్యాల పట్టణంలో గురువారం నాడు ఓ ప్రకటనలో బొజ్జా దశరథ రామిరెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆలోచనలకు, అవసరాలకు, ఆకాంక్షలకు అనుగుణంగా పాణ్యం, గడివేముల మండలాలను నూతనంగా ఏర్పాటు కాబోతున్న ఈ రెండు మండలాలకు అత్యంత దగ్గరగా వున్న నంద్యాల జిల్లాలోనే పాణ్యం , గడివేముల మండలాలను చేర్చాలని కోరారు. మరియు ఇప్పుడు కొత్తగా ఏర్పాటవుతున్న జిల్లాలకు అదనంగా ఆదోని, గుంతకల్లు, మదనపల్లె, మార్కాపురం లను జిల్లాలుగా చేయాలని కోరుతూ జిల్లా కలెక్టరు గారికి విడివిడిగా వినతిపత్రాలను అందచేసి నట్లు రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి తెలిపారు.



# జాన్వీ కపూర్ పై మళ్లీ తెలుగు జనాల విమర్శలు



శ్రీదేవి ని తెలుగు ప్రేక్షకులు దేవత మాదిరిగా ఆదరించారు.. అభిమానించారు. ఆమె మృతి చెందిన సమయంలో తెలుగు అభిమానుల గుండెలు పలిగాయి. ఆమె నటించిన సినిమాలు ఇప్పటికి కూడా అపురూపంగా తెలుగు ప్రేక్షకులు చూస్తూ ఉంటారు అనడంలో ఎలాంటి సందేహం లేదు. అంతగా తెలుగు ప్రేక్షకులు శ్రీదేవి ని అభిమానిస్తున్నారు. అంతటి అభిమానం ను శ్రీదేవి పై కలిగి ఉన్న తెలుగు ప్రేక్షకులకు ఆమె వారసురాలిని తెలుగు సినిమా లో చూడాలనే కోరిక బలంగా ఉంది.అతిలోక సుందరి శ్రీదేవి నట వారసురాలిగా ఆమె బతికి ఉన్న సమయంలోనే జాన్వీ కపూర్ హీరోయిన్ గా సినిమా మొదలు పెట్టింది. కాని శ్రీదేవి తన కూతురు మొదటి సినిమాను వెండి తెరపై చూడలేక పోయారు. శ్రీదేవి బతికి ఉంటే ఇప్పటి వరకు జాన్వీ కపూర్ ను తెలుగు సినిమా ల్లో నటింపజేసే వారు అనేది అభిమానుల టాక్. సౌత్ లో శ్రీదేవికి ఏ స్థాయి అభిమానులు ఉన్నారో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. తల్లి అభిమానులను సంతోషపెట్టాల్సిన బాధ్యత జాన్వీ కపూర్ పై ఉంది.కాని జాన్వీ కపూర్ మాత్రం కేవలం బాలీవుడ్ సినిమాలపైనే ఎక్కువ ఫోకస్ పెడుతోంది. సరే అక్కడ అయినా కమర్షియల్ గా బంపర్ హిట్ లు ఏమైనా కొట్టిందా అంటే అది ఏమీ లేదు. ఇప్పటి వరకు హిందీ లో జాన్వీ కపూర్ సక్సెస్ దక్కించుకోలేక పోయింది. అక్కడ కమర్షియల్ బ్రేక్ కోసం ప్రయత్నాలు చేస్తుంది. ఈ సమయంలో సౌత్ నుండి అంది వచ్చిన ఆఫర్లను జాన్వీ కపూర్ కాదంటున్నట్లుగా విమర్శలు వస్తున్నాయి.తండ్రి బోనీ కపూర్ నుండి పలువురు ఫిల్మ్ మేకర్స్ జాన్వీ కపూర్ ను ఒప్పించే ప్రయత్నాలు చేసినా కూడా తెలుగు సినిమాను మాత్రం కమిట్ అయ్యేందుకు ఆసక్తి చూపడం లేదు అంటూ టాక్ వినిపిస్తుంది. భారీ అంచనాల నడుమ రూపొందుతున్న సినిమాల్లో ఈమెను నటింపజేసేందుకు ప్రయత్నాలు జరిగాయి. కాని గత రెండు మూడు సంవత్సరాలుగా ఈమె ప్రతి సౌత్ సినిమాకు కూడా నో చెబుతూనే వస్తుందట.తాజాగా రామ్ హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో కన్ఫర్మ్ అయిన సినిమా కోసం జాన్వీ కపూర్ ను దించే ప్రయత్నాలు చేశారు. బాలీవుడ్ లో తనకు ఉన్న లీడ్స్ ద్వారా చిత్ర దర్శకుడు జాన్వీ కపూర్ ను సంప్రదించేందుకు ప్రయత్నించాడట. కాని ఇప్పటి వరకు ఆమె నుండి ఎలాంటి రెస్పాన్స్ రావడం లేదు. కనీసం స్క్రిప్ట్ వినేందుకు కూడా ఆసక్తి చూపడం లేదు అంటూ గుసగుసలు వినిపిస్తున్నాయి.సౌత్ సినిమా పరిశ్రమను ముఖ్యంగా తెలుగు సినిమాలను జాన్వీ కపూర్ అవమానించినట్లగా వ్యవహరిస్తుంది అంటూ కొందరు విమర్శలు చేస్తున్నారు. ఇప్పుడు తెలుగు సినిమా బాలీవుడ్ సినిమాకు ఏమాత్రం తీసిపోదు. అందుకే బాలీవుడ్ స్టార్ హీరోయిన్స్ పలువురు తెలుగు సినిమాల్లో నటించారు.. నటిస్తున్నారు. ఇటీవల ఆలియా నటించింది.. ప్రస్తుతం దీపికా పదుకునే నటిస్తుంది. అయినా కూడా జాన్వీ కపూర్ ఎందుకు తెలుగు సినిమాకు ఓకే చెప్పడం లేదంటూ కొందరు సూటిగా ప్రశ్నిస్తున్నారు.

## ఆ సినిమాలకు 'భీమ్లా నాయక్' బిగ్ స్ట్రోక్ తప్పదా?

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ నటించిన తాజా చిత్రం 'భీమ్లా నాయక్' . మలయాళ సూపర్ హిట్ ఫిల్మ్ 'అయ్యప్పనుమ్ కోషయుమ్' ఆధారంగా ఈ మూవీని తెలుగులో రీమేక్ చేశారు. మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ డైలాగ్స్ స్క్రీన్ ప్లే అందించిన ఈ చిత్రాన్ని 'అప్పట్లో ఒకడుండేవాడు' ఫేమ్ సాగర్ కె. చంద్ర తెరకెక్కించారు. మలయాళ వెర్షన్ తో పోలిస్తే తెలుగులో భారీ మార్పులు చేసినట్టుగా కనిపిస్తోంది. టీజర్ లో పవన్ రానా మధ్య మాటల యుద్ధం.. అరేయ్ డానీ బయటికి రారా నా కొడకా .. అంటూ పవన్ చెప్పిన డైలాగ్ లు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి.ఇందులో భాగంగానే రానా పాత్రని విలన్ గా మార్చినట్టుగా తెలుస్తోంది. ఈ ఇద్దరి మధ్య పవర్ డ్యూటీ.. ఈగో వంటి కారణాల వల్ల వైరం నెలకొనడం.. ఆ తరువాత క్రమంలో అంటే సినిమా ఎండ్ లో రానా రియలైజ్ అయి మారిపోవడం వంటివి తెలుగు వెర్షన్ లో ప్రధాన భూమికని పోషించనున్నాయని గత కొన్ని నెలలుగా వార్తలు వినిపిస్తున్నాయి. నిత్యామీనన్ సంయుక్త మీనన్ హీరోయిన్ లుగా నటించిన ఈ చిత్రంలో పవన్ కల్యాణ్ పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్ గా నటిస్తుండగా రానా లోకల్ లీడర్ గా పవర్ ఫుల్ పాత్రలో డానియెల్ శేఖర్ గా కనిపించనున్నారు.గత కొన్ని నెలలుగా ఈ మూవీ రిలీజ్ వాయిదా పడుతూ వస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ మూవీ రిలీజ్ ని ఫైనల్ గా ఫిబ్రవరి 25కు ఫిక్స్ చేశారు. దీంతో ఈ మూవీ ప్రమోషన్స్ ని చిత్ర బృందం ఇప్పటికే ప్రారంభించేసింది. 'వకీల్ సాబ్' తరువాత పవన్ నుంచి వస్తున్న మాసీవ్ యాక్షన్ ఎంటర్ టైనర్ ఇది. దీంతో ఈ మూవీ పై సహజంగానే అంచనాలు ఏర్పడ్డాయి. పవన్ - రానాల తొలి కలయికలో వస్తున్న సినిమా కావడం కూడా దీనిపై భారీ క్రేజ్ ఏర్పడింది. దీంతో ఇప్పటికే ఓవర్సీస్ లో రికార్డు స్థాయిలో అడ్వాన్స్ బుకింగ్స్ నమోదవుతున్నాయి. అంతే కాకుండాప్రీమియర్స్ కి కూడా భారీ క్రేజ్ ఏర్పడటంతో టికెట్స్ రికార్డు స్థాయిలో బుకింగ్ అవుతుండటం గమనార్హం.

ఇదిలా వుంటే ఈ మూవీ కారణంగా మార్చి 4కు మారిన సినిమాలకు మరోసారి 'భీమ్లా నాయక్ ' కారణంగా బిగ్ స్ట్రోక్ తప్పదని తెలుస్తోంది. ఫిబ్రవరి 25న విడుదలకు సిద్ధమవుతున్న ఈ మూవీకి తొలి రోజు భీభత్సమైన టాక్ వస్తే దాని ప్రభావం రెండు మూడు వారాల వరకు వుంటుందని చెబుతున్నారు.మార్చి 11న 'రాధేశ్యామ్' రిలీజ్ కాబోలోంది. అప్పటి వరకు బాక్సాఫీస్ వద్ద 'భీమ్లా నాయక్ ' ప్రకంపణలు ఆగవని చెబుతున్నారు. ఇదే నిజమైతే మార్చి 4న విడుదల కు సిద్ధమవుతున్న చిత్రాలకు ఇబ్బందులు తప్పవని తెలుస్తోంది. 'భీమ్లా నాయక్' క్రేజ్ కారణంగా ఆ తరువాత వచ్చే సినిమాలకు ఎగ్జిబిటర్లు థియేటర్లని కేటాయించడం కష్టమే. 'రాధేశ్యామ్' రిలీజ్ వరకు అన్ని థియేటర్లలోనూ 'భీమ్లా నాయక్' సందడే కనిపిస్తుందని మిగతా చిత్రాలకు పెద్దగా స్కోప్ వుండదని ట్రేడ్ వర్గాలు అంటున్నాయి

# లయ ను ఇలా చూడటం ఆశ్చర్యంగా ఉంది



తెలుగు ప్రేక్షకులకు హీరోయిన్ లయ గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. ఆమె చేసిన సినిమాలు ఇప్పటికి కూడా ఆమె ను జనాలు గుర్తు పెట్టుకునేలా చేశాయి. హీరోయిన్ గా సుదీర్ఘ కాలంగా ప్రేక్షకులకు దూరంగా ఉన్నా కూడా ఆమెను ఇంకా జనాలు అభిమానిస్తూనే ఉన్నారు. తాజాగా లయ సోషల్ మీడియాలో సందడి చేస్తున్నారు. ఆమె చేస్తున్న ప్రతి పోస్ట్ ను కూడా చర్చనీయాంశం అవుతుంది.ప్రస్తుతం సోషల్ మీడియాను కుదిపేస్తున్న కచ్చా బాదాం పాటకు లయ డాన్స్ చేసింది. ఆ పాటకు ఇప్పటికే ఎంతో మంది స్టార్స్ మరియు సోషల్ మీడియా సెలబ్రెటీలు డాన్స్ చేసి అలరించారు.ఇప్పుడు లయ కూడా ఆ పాటకు డాన్స్ చేసింది. చీర కట్టులో సింపుల్ స్టెప్పులతో ఆ పాట కు అనుగుణంగా డాన్స్ చేసి ఆకట్టుకుంది. ఇన్నేళ్ల తర్వాత మళ్లీ లయను ఇలా చూడటం చాలా సంతోషంగా ఉందంటూ అభిమానులు కామెంట్ చేస్తున్నారు.లయ ఫోటోలు మరియు వీడియోలు రెగ్యులర్ గా సోషల్ మీడియాలో వైరల్ అవుతూనే ఉన్నాయి. ఈ సమయంలో ఆమె రీ ఎంట్రీ ఇచ్చే అవకాశాలు ఉన్నాయనే ప్రచారం జరుగుతోంది. ఆ మధ్య లయ రీ ఎంట్రీ ఇవ్వబోతుంది అనే వార్తలు జోరుగా వచ్చాయి.కాని ఆమె ఇమేజ్ కు తగ్గ ఆఫర్లు రాకపోవడంతో వెనక్కి తగ్గినట్లుగా సమాచారం. లయ నటిగా మళ్లీ రీ ఎంట్రీ ఇవ్వాలని కొందరు కోరుకుంటున్నారు.ఈ వీడియో చూసిన తర్వాత నెటిజన్స్ లయ మళ్లీ సినిమా ఇండస్ట్రీలోకి రీ ఎంట్రీ ఇవ్వాలంటూ మరింతగా డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికి కూడా హీరోయిన్ గా కూడా నటించేంత అందంగా లయ ఉందంటూ కామెంట్స్ వస్తున్నాయి.ఇప్పటికే సీనియర్ హీరోయిన్స్ చాలా మంది రీ ఎంట్రీ ఇచ్చారు. కనుక లయ కూడా ఇప్పుడు కాకున్నా మరికొన్ని రోజుల తర్వాత అయినా హీరోయిన్ గా రీ ఎంట్రీ ఇస్తుందేమో చూడాలి.బుల్లి తెర తో పాటు వెండి తెరపై కూడా తనదైన ముద్రను వేసిన లయ 1992 లో బద్రం కొడుకో సినిమా తో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయ్యింది. 1999 సంవత్సరంలో వచ్చిన స్వయంవరం సినిమా ఆమె కెరీర్ ను మార్చేసింది.హీరోయిన్ గా ఆ తర్వాత వరుస సినిమాలు చేసింది. నటిగా తన సత్తా చాటుతూ అభిమానులను సొంతం చేసుకుంది. నటిగా మంచి ఫామ్ లో ఉన్న సమయంలోనే సినిమాలకు దూరం అయ్యింది. మళ్లీ ఆమె రీ ఎంట్రీ కోసం అభిమానులు ఎదురు చూస్తున్నారు.

# రోహిత్ శర్మను ఊరిస్తున్న ప్రపంచ రికార్డు.. తొలి ఆటగాడిగా!




స్వదేశంలో వెస్టిండీస్‌ను క్లీన్ స్వీప్ చేసిన టీమిండియా మరో కీలక పోరుకు సిద్ధమైంది. లక్నో వేదికగా ఫిబ్రవరి 24 నుంచి శ్రీలంక- భారత్ మధ్య టీ20 సిరీస్ ప్రారంభం కానుంది. ఇక శ్రీలంకతో తొలి టీ20కు మందు టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మను ప్రపంచ రికార్డు ఊరిస్తోంది. గురువారం జరిగే తొలి టీ20 మ్యాచ్‌లో 36 పరుగులు చేస్తే.. అంతర్జాతీయ టీ20ల్లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా రోహిత్ రికార్డు సాధిస్తాడు. ప్రస్తుతం రోహిత్ శర్మ 3,263 పరుగులతో మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. తొలి స్థానంలో 3299 పరుగులతో న్యూజిలాండ్ బ్యాటర్ మార్టిన్ గుప్టిల్ ఉండగా, రెండో స్థానంలో 3,296 పరుగులతో టీమిండియా మాజీ కెప్టెన్ కోహ్లి ఉన్నాడు.ఇక భారత్- శ్రీలంక తొలి టీ20 విషయాని?కి వస్తే.. స్టార్ ఆటగాళ్లు లేకుండానే భారత్ బరిలోకి దిగుతోంది. టీమిండియా స్టార్ క్రికెటర్లు విరాట్ కోహ్లి, పంత్‌లకు విశ్రాంతి ఇవ్వగా.. రాహుల్, వాషింగ్టన్ సుందర్ గాయాల కారణంగా దూరమయ్యారు. ఇక గాయం కారణంగా జట్టుకు దూరంగా ఉన్న రవీంద్ర జడేజా తిరిగి జట్టులోకి చేరనున్నాడు. కాగా ఇరు జట్లు ఇప్పటి వరకు 21 మ్యాచుల్లో తలపడగా.. భారత్ 14, శ్రీలంక 7 విజయాలు సాధించాయి. ఇందులో ఒక మ్యాచ్‌లో ఫలితం తేలలేదు. అయితే స్వదేశంలో శ్రీలంకపై భారత్ పూర్తి అధిపత్యం చెలాయించింది. ఇప్పటి వరకు స్వదేశంలో భారత్ మ్యాచ్‌ల్లో గెలవగా.. శ్రీలంక కేవలం రెండు మ్యాచ్‌ల్లో విజయం సాధించింది.

# ఐపీఎల్‌కు దూరం కానున్న స్టార్ ఆల్‌రౌండర్.. రూ. 14 కోట్లు వృథ్ధమేనా!

టీమిండియా యంగ్ ఆల్‌రౌండర్ దీపక్ చహర్ తొడ కండరాల గాయంతో శ్రీలంకతో టి20 సిరీస్‌కు దూరమైన సంగతి తెలిసిందే. టైమ్స్ ఆఫ్ ఇండియా నివేదిక ప్రకారం దీపక్ చహర్‌కు గాయం త్రీవత ఎక్కువగా ఉందని తేలింది. దీంతో చహర్ ఐపీఎల్ 2022 సీజన్‌కు దూరమయ్యే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇదే నిజమైతే సీఎస్‌కే పెద్ద దెబ్బ పడినట్లే.ఎందుకంటే ఈసారి మెగావేలంలో సీఎస్‌కే దీపక్ చహర్‌ను రూ. 14 కోట్లు పెట్టి కొనుగోలు చేసింది. సీజన్‌కు చహర్ దూరమైతే మాత్రం సీఎస్‌కే భారీ మొత్తంలో నష్టపోనుంది. గతేడాది ఐపీఎల్‌లో చహర్ సీఎస్‌కే తరపున అదరగొట్టాడు. ఒక రకంగా సీఎస్‌కే టైటిల్ గెలవడంలో దీపక్ చహర్ కీలకపాత్ర పోషించాడు. చహర్ దూరమైతే అతనికి రీప్లేస్‌మెంట్ విషయంలోనూ సీఎస్‌కేకు సరైన ఆటగాడు లేడు. అంతేకాదు ఏడాది కాలంగా దీపక్ చహర్ బంతితోనే కాదు బ్యాట్‌తోనూ అదరగొడుతున్నాడు. శ్రీలంక గడ్డపై జరిగిన వన్డే సిరీస్‌లో 65 పరుగుల కీలక ఇన్నింగ్స్‌తో తనలో ఆల్‌రౌండర్ ఉన్నాడని నిరూపించిన చహర్ ఆ తర్వాత చాలా సందర్భాల్లోనూ టీమిండియా తరపున పలు మ్యాచ్‌లో మెరిశాడు. ఇక? విండీస్‌తో ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగిన మూడో టి20లో బౌలింగ్ చేస్తూ గాయపడ్డాడు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**